అగ్నికి ఆహుతైన మొక్కజొన్న
● రైతుకు రూ.4 లక్షలకు పైగా నష్టం
6
కట్టుదిట్టంగా 'మిషన్ వాత్సల్య'
● జిల్లాలో బాల్య వివాహాలను రూపు మాపాలి : కలెక్టర్ శ్రీధర్


ప్రమాదంలో దెబ్బతిన్న లారీ (ఫైల్)

# అమ్మో... జాతీయ రహదారి...!


ములకలచెరువు ఆర్టీసీ బస్టాండు వద్ద ఇరుకుగా ఉన్న రోడ్డుపై వాహనాలు


రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సోమశేఖర్ కుటుంబం (ఫైల్)

- విస్తరణ తరువాత నెత్తురోడుతున్న రోడ్డు
- ములకలచెరువు మండలంలో అత్యధిక ప్రమాదాలు
- నాలుగు నెలల వ్యవధిలో 11 మంది మృతి....30 మందికిపైగా గాయాలు
- ఇటీవల జరిగిన ప్రమాదంలో ఒకే కుటుంబంలో నలుగురు...

ములకలచెరువు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ముంబాయి-చెన్నై జాతీయ రహదారి (ఎన్‌హెచ్-42) అంటే వాహనదారులు హడలెత్తి పోతున్నారు. శ్రీసత్యసాయి-అన్నమయ్య జిల్లా సరిహద్దు నుంచి ములకలచెరువు మీదుగా మదనపల్లెకు వరకు ఉన్న జాతీయ రహదారిలో ప్రతిరోజూ ఏదో ఒకచోట రోడ్డు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఒక్క ములకలచెరువు మండలంలోనే అత్యధికంగా ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. నాలుగు నెలల వ్యవధిలో 11 మంది మృత్యువాత పడగా 30 మందికిపైగా తీవ్రంగా గాయపడ్డారు. జాతీయ రహదారి విస్తరణ పనులు జరిగినప్పటి నుంచి ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. గత వారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు, ఇద్దరు చిన్నారులు మృతి చెందారు. శ్రీసత్యసాయి-అన్నమయ్య జిల్లా సరిహద్దు నుంచి మదనపల్లె వరకు ఉన్న ముంబాయి-చెన్నై జాతీయ రహదారికి విస్తరణకు కేంద్ర ప్రభుత్వం రూ.480.10 కోట్లు విడుదల చేసింది. 2022 డిసెంబరులో ప్రారంభమైన విస్తరణ పనులు ముగింపు దశకు చేరుకున్నాయి. వాహనాలు అతివేగంగా రాకపోకలు సాగించడం, ద్విచక్రవాహనదారులు హెల్మెట్లు ధరించకపోవడంతో పాటు పలువురు వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించక నిర్లక్ష్యం వహించడంతో ప్రమాదాలు అధికమయ్యాయి.

### ఇటీవల జరిగిన ప్రమాదాలు

● గత ఏడాది అక్టోబరు 7వ తేదీ ములకలచెరువు మండలం వేపూరికోట పంచాయతీ గురికివారిపల్లెకు చెందిన చిప్పలమడుగు చిన్నమ్మ (80) తెల్లవారుజామున 4.45 గంటల సమయంలో జాతీయ రహదారి దాటుతుండగా వేగంగా వచ్చిన ఐచర్ వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందింది.


రోడ్డు ప్రమాదంలో నుజ్జునుజ్జయిన బైక్ (ఫైల్)

● గత ఏడాది అక్టోబరు 15వ తేదీ ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొనడంతో కదిరినాథుని కోట పంచాయతీ నాయనివారిపల్లెకు చెందిన తిరుమల శ్రీనివాసులు (45) మృతి చెందాడు.

● గత ఏడాది అక్టోబరు 18న మండలంలోని సోంపల్లె పంచాయతీ గట్టుకిందపల్లెకు చెందిన శంకరప్ప (54) బస్టాండు సర్కిల్ సమీపంలో రోడ్డు దాటుతుండగా ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో శంకరప్ప తీవ్రంగా గాయపడి మృతి చెందాడు.

● నవంబరు 13వ తేదీ ములకలచెరువు మార్కెట్ ఎదురుగా రెండు ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో శ్రీసత్యసాయి జిల్లా తనకల్లు మండలం ఎర్రబల్లికి చెందిన శ్రీనివాసులురెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. తలకు బలమైన గాయమై ఆయన కోమాలోకి వెళ్లి మూడు నెలలుగా అనంతపురం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఇదే నెలలో కారు ఢీకొనడంతో ట్రాన్స్‌కో లైన్‌మన్ అప్పిరెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు.

● డిసెంబరు 11న ద్విచక్రవాహనాన్ని బొలెరో లగేజీ వాహనం ఢీకొనడంతో రైతు సూర్యనారాయణ (55) దుర్మరణం చెందాడు.

● గత ఏడాది డిసెంబరు నెలలోనే మండలంలోని వేపూరికోట పంచాయతీ చీకుచెట్టుపల్లెకు చెందిన నరసింహులు (60) చిన్నేరు వంతెనపై ద్విచక్రవాహనాన్ని వేగంగా వచ్చిన కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో నరసింహులు మదనపల్లె జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.

● జనవరి 5వ తేదీ ములకలచెరువు బస్టాండు సర్కిల్ సమీపంలో ముంబాయి-చెన్నై జాతీయ రహదారిలో రాత్రి 8.30 గంటల సమయంలో పెద్దతిప్పసముద్రం మండలం మద్దయ్యగారిపల్లెకు చెందిన శ్రీనివాసులు (45)పై లారీ దూసుకెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

● ఈనెల 2వ తేదీ మదనపల్లె నీరుగట్టువారిపల్లెలోని తిలక్‌రోడ్డులో నివాసమున్న వంశీకృష్ణ (29), రవితేజ (28)లు శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లెలో జరుగుతున్న స్నేహితుడి పెళ్లికి వెళ్లి తిరిగి వస్తుండగా పెద్దపాళ్యం వంతెన వద్ద ద్విచక్రవాహనం మట్టిదిబ్బను ఢీకొంది. ప్రమాదంలో వంశీకృష్ణ అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుక కూర్చున్న రవితేజ తీవ్రంగా గాయపడ్డాడు.

● ఈనెల 8వ తేదీ జాతీయ రహదారిలోని ములకలచెరువు షాదీమహల్ సమీపంలో ఉన్న పెట్రోల్ బంకు వద్ద నిరుపేద కుటుంబాన్ని రోడ్డు ప్రమాదం కబళించింది. రోడ్డు ప్రమాదంలో భర్త, ఇద్దరు పిల్లలు మృతి చెందగా... రెండు రోజులు మృత్యువుతో పోరాడి భార్య కూడా కన్ను మూసింది. రోడ్డు ప్రమాదంలో మదనపల్లెకు చెందిన ఒకే కుటుంబానికి చెందిన సోమశేఖర్, అతని భార్య కవిత, వారి కుమారుడు రెడ్డిశేఖర్, కుమార్తె సిద్దేశ్వరిలు మృతి చెందారు. ఆ కుటుంబంలో ఒకరు కూడా మిగలకుండా మొత్తం రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం అందరినీ కలచివేసింది.

### రోడ్డు విస్తరణపై విమర్శలు...

ములకలచెరువులో జరిగిన రోడ్డు విస్తరణ పనులపై విమర్శలు జోరుగా విన్పిస్తున్నాయి. స్థానిక రైల్వేగేటు సమీపం నుంచి మార్కెట్ యార్డు వరకు రోడ్డుకు ఇరువైపులా సిమెంటు దిమ్మెలు ఏర్పాటు చేశారు. దీంతో ఇక్కడ రోడ్డు కూడా వెడల్పు తక్కువగా ఉండడంతో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. రైల్వే గేటు నుంచి మార్కెట్ యార్డు వరకు ఉన్న రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేసిన సిమెంటు దిమ్మెలతో ట్రాఫిక్‌కు తరచూ అంతరాయం కలగడంతో పాటు రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్న విమర్శలున్నాయి.

### టమోటాల వాహనాలతోనే...

ముంబాయి-చెన్నై జాతీయ రహదారిలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు 90 శాతం టమోటాలు తీసుకెళ్తున్న ఐచర్, బొలేరో లగేజి వాహనాలతోనే జరుగుతున్నాయి. టమోటాలు ములకలచెరువు మార్కెట్‌కు తీసుకొచ్చిన తరువాత ఇక్కడ అన్‌లోడ్ చేసి తిరిగి వెళ్లే సమయంలో పలు వాహనాలు అతివేగంగా వెళ్తున్నాయి. అలాగే మార్కెట్‌కు త్వరగా తీసుకెళ్లాలని పలువురు డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తున్నారు. దీని కారణంగా రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. పోలీసులు ప్రత్యేక చొరవ తీసుకుని వాహనాల వేగం నియంత్రించగలిగితే ప్రమాదాలు తగ్గే అవకాశం లేకపోలేదు.

### ట్రాఫిక్ నిబంధనలు కఠినంగా అమలు చేస్తాం



రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు కఠినంగా అమలు చేస్తాం. ప్రతి నెలా ట్రాఫిక్ నిబంధనలు పాటించని 1200 మంది వరకు వాహనదారులకు జరిమానాలు విధిస్తున్నాం. ట్రాఫిక్ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో సిబ్బందిని విధుల్లో ఉంచుతున్నాం. మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నాం. వాహనదారులకు ప్రతిరోజూ ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్నాం. రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని చర్యలు చేపట్టాం.

- లక్ష్మన్న, సీఐ, ములకలచెరువు


ఆక్రమణకు గురైన గుట్టను పరిశీలిస్తున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

# సమస్యలు పరిష్కరించకపోతే ఎలా?

- వెంటనే ప్రగతి చూపించండి
- రెవెన్యూ ఉద్యోగులపై కలెక్టర్ శ్రీధర్ ఆగ్రహం
- ఐదుగురికి షోకాజ్ నోటీసులు

సుండుపల్లె, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా, రెవెన్యూ సదస్సులలో ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేయడం తగదని, వెంటనే ప్రగతి చూపించకపోతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఉద్యోగులను హెచ్చరించారు. మంగళవారం సుండుపల్లె తహసీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మండలంలో నిర్వహించిన పీజీఆర్ఎస్, రెవెన్యూ సదస్సుల్లో ప్రజల నుంచి అర్జీల పరిష్కారం ప్రగతిపై తహసీల్దార్, ఆర్ఐ, మండల సర్వేయర్, వీఆర్వో, వీఆర్ఏలతో సమీక్షించారు. ఇందులో భాగంగా భూమి సమస్యలపై సదస్సులో వచ్చిన మొత్తం అర్జీలు ఎన్ని, పరిష్కరించినవి ఎన్ని, పెండింగ్‌లో ఉన్నవి ఎన్ని అని తహసీల్దార్‌ను కలెక్టర్ ప్రశ్నించగా మండలంలో మొత్తంగా భూమి సమస్యలపై 506 దరఖాస్తులు వచ్చాయని, వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు తహసీల్దార్ దైవాదీనం కలెక్టర్‌కు వివరించారు. గ్రామాల్లో అంశాల వారీగా అర్జీలు పెండింగ్ ఉండడానికి గల కారణాలను వీఆర్వో, వీఆర్ఏలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అర్జీల పరిష్కారంలో శ్రద్ధ చూపకుండా ప్రగతిలో వెనుకబడిన తిమ్మసముద్రం, జి.రెడ్డిగారిపల్లె, ముదుంపాడు, భాగంపల్లి, చిన్నగొల్లపల్లి వీఆర్వో, వీఆర్ఏలకు, ఒక సర్వేయర్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నామన్నారు. మూడు రోజుల లోపల ప్రగతి చూపకపోతే శాఖాపరంగా వారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండలంలో ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురైనట్లు గుర్తిస్తే వెంటనే స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు.

### మట్టి తరలించిన వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయండి

సుండుపల్లె-3 పరిధిలో యర్రగుట్ట ప్రాంతాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఇక్కడ మట్టి అక్రమంగా తరలిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అలాంటి వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. అలాగే శ్మశాన వాటికకు భూమి కేటాయించాలని గ్రామస్థులు కోరుతున్నారని, 1.18 ఎకరాలు అందుబాటులో ఉందని తహసీల్దార్ వివరించారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ అదే ప్రాంతంలో శ్మశాన వాటికకు భూమి కేటాయింపునకు ప్రతిపాదనలు పంపాలని తెలిపారు. మండల వ్యాప్తంగా గుట్టలు, కొండలు, చెరువులు, కుంటలను ఆక్రమణదారుల నుంచి కాపాడాలని ఆదేశించారు. అనంతరం గుట్టను చదును చేసి మట్టిని తరలిస్తున్న ప్రాంతాన్ని కలెక్టర్ పరిశీలించారు. రెవెన్యూ అధికారులు నాటిన బోర్డులను తొలగించి ఆక్రమణలకు పాల్పడుతున్న విషయాన్ని ఆంధ్రజ్యోతి వెలుగులోకి తీసుకువచ్చింది. కార్యక్రమంలో ఆర్ఐ, మండల సర్వేయర్, వీఆర్వో, వీఆర్ఏలు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నీరు, నేల సంరక్షణే ప్రభుత్వ ధ్యేయం

- కేంద్ర అధికారి ప్రకాశ్‌కుమార్

నిమ్మనపల్లి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): నీరు, నేల సంరక్షణే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ధ్యేయమని కేంద్ర అధికారి, రివార్డ్ ఎక్స్‌పర్ట్, డీవోఎల్ఆర్ (డిపార్ట్‌మెంట్ ఆఫ్ ల్యాండ్ రిసోర్సెస్) ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల ఇన్‌చార్జ్ ప్రకాశ్‌కుమార్ తెలిపారు. మంగళవారం మండలంలోని ముష్టూరు గ్రామ పంచాయతీలోని కస్తూర్బాగాంధీ పాఠశాల ఆవరణంలో వాటర్‌షెడ్ యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకాష్‌కుమార్ మాట్లాడుతూ రెండేళ్ల క్రితం వెనుకబడిన గ్రామాలను గుర్తించి ఈ గ్రామాల్లో నీటిని సంరక్షించేందుకు వాటర్‌షెడ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండలంలోని రెడ్డివారిపల్లి, ముష్టూరు, కొండయ్యగారిపల్లి గ్రామ పంచాయతీలను గుర్తించి ఆ గ్రామాల్లో పలు రకాల పనులు చేపట్టినట్లు తెలిపారు. వాటర్‌షెడ్ ప్రారంభించి రెండేళ్లు కావడంతో పీఎంకేఎస్‌వైపై వాటర్‌షెడ్ యాత్రను చేపట్టినట్లు తెలిపారు. డ్వామా పీడీ వెంకటరత్నం మాట్లాడుతూ నీటిని సంరక్షించే యోధుడిగా ప్రతి వ్యక్తి మారాలనే సదుద్దేశ్యంతో పథకాన్ని ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ముఖ్యంగా నీటిని ఎలా సంరక్షించుకోవాలనేది తెలియకపోతే మానవ మనుగడ కష్టమని, నీటిని సంరక్షించుకుంటే భావితరాలకు ఎలాంటి ఇబ్బంది ఉండదని తెలిపారు. పారే నీటిని ఒడిసి పట్టుకోవడం, పట్టుకొన్న నీటిని భూమిలోకి ఇంకేటట్టు చేయడమే వాటర్‌షెడ్ అని తెలిపారు. దీని వలన భూగర్భ జలాలు పెరిగి మానవ మనుగడకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. వాటర్‌షెడ్ పనులు చేపట్టడం ద్వారా భూగర్భజలాలు పెరిగి నీటి సమస్య రాకుండా చూడవచ్చన్నారు. అలాగే ఉపాధి హామీలో చేపట్టే నీటి సంరక్షణ పనులు, వాటర్‌షెడ్ పనుల వలన నీటిని సంరక్షించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వాటర్‌షెడ్ ఏపీడీ లక్ష్మీనరసయ్య, ఉపాధి ఏపీడీ శ్రీనివాసులు, ఎంపీడీవో పరమేశ్వర్‌రెడ్డి, ఏవో రమేష్, సర్పంచ్ చెంద్రాయుడు, మాజీ సర్పంచ్ రమణ, మహమ్మద్‌రఫి, నాయకులు నాగరాజనాయుడు, మురళి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డీవోఎల్ఆర్ ప్రకాశ్‌కుమార్

# చెత్తలోనూ.. కాసుల వేట...!

- రూ.1.55 లక్షలకు పెట్టింది రూ.8.50 లక్షల బిల్లు
- వైద్య ఆరోగ్య శాఖ తీరు...
- దోచుకునేందుకే దొంగ బిల్లులా?

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో కొందరు అధికారులు చెత్తలోనూ కాసుల వేట సాగిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో రోజూవారీ వచ్చే వ్యర్థాల వల్ల పర్యావరణం, మనుషులకు ఎటువంటి నష్టం జరగకూడదనే లక్ష్యంతో ఏర్పాటైన కామన్ బయో మెడికల్ వేస్ట్ ట్రీట్‌మెంటు ఫెసిలిటీ (సీబీఎండబ్ల్యూటీఎఫ్)ల ద్వారా పని జరగకపోయినా.. కొద్దో గొప్పో పని జరిగినా.. పూర్తి స్థాయిలో బిల్లులు చేసుకుంటున్నారు. సీబీఎండబ్ల్యూటీఎఫ్ పేరుతో దోచుకునేందుకు అధికారులు దొంగ బిల్లులు పెడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వాస్తవానికి రెండు బిల్లుల్లో మొత్తం రూ.1.55 లక్షలైతే, రూ.8.50 లక్షలకు బిల్లులు చేయడానికి అధికారులు ట్రెజరీకి పంపించారు. అయితే ఈ బిల్లులను ట్రెజరీలో వెనక్కి పంపడం విశేషం.

జిల్లాలో 49 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. సాధారణంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు చికిత్స కోసం రోజూ రోగులు వస్తుంటారు. దీంతో సూదులు, బ్యాండేజ్, సెలైన్‌బాటిళ్లు, సూది మందుల బాటిళ్లు, మాత్రల స్ట్రిప్పులు వంటి వ్యర్థాలు తయారవుతాయి. వీటిలో చాలా వాటిని ఎక్కడ పడితే అక్కడ పడేయడం వల్ల పర్యావరణానికి హాని కలగడంతో పాటు ప్రజలకు కూడా ప్రమాదం పొంచి ఉంటుంది. దీంతో గతంలో ఇటువంటి వ్యర్థాలను ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆవరణలో ఎక్కడో ఒక మూలన కాల్చివేసేవాళ్లు. అయితే దీనివల్ల పర్యావరణానికి హాని కలుగుతుండడంతో దీనిని నివారించడానికి రాష్ట్ర ప్రభుత్వం సీబీఎండబ్ల్యూటీఎఫ్ సౌకర్యాన్ని తెచ్చింది. బయోమెడికల్ వేస్ట్ ట్రీట్‌మెంట్ వల్ల పర్యావరణ, మనుషుల ఆరోగ్యంపైన కలిగే హానికరమైన


చిన్నమండెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన సీబీఎండబ్ల్యూటీఎఫ్ బాక్సులు

దుష్ఫలితాలను తగ్గించవచ్చు. ఈ వ్యర్థాలను సక్రమమైన పద్ధతిలో ధ్వంసం చేయవచ్చు. కేవలం మారుమూల గ్రామాలలో సీబీఎండబ్ల్యూటీఎఫ్ అవకాశం లేనిచోట్ల మాత్రమే వ్యర్థాలను కాల్చివేయడానికి ప్రభుత్వ అనుమతి ఉంది. దీంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పసుపు, ఎరుపు, నీలం, తెలుపు రంగు బాక్సులను ఏర్పాటు చేశారు. ఈ బాక్సులలో ఈ వ్యర్థాలను వేస్తారు. ఈ నేపధ్యంలో జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో బయో వ్యర్థాలను సేకరించి ట్రీట్‌మెంట్ చేయడానికి సీబీఎండబ్ల్యూటీఎఫ్ సర్వీస్ ప్రొవైడర్లుగా జిల్లాలో అనంతపురానికి చెందిన శ్రీవేన్ ఎన్విరాన్ టెక్నాలజీస్, తిరుపతికి చెందిన ఏడబ్ల్యుఎం కన్సల్టింగ్ లిమిటెడ్ కంపెనీలకు అనుమతులు ఉన్నాయి. అయితే ఇందులో చాలాచోట్ల సక్రమంగా వ్యర్థాలను సేకరించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. స్థానికంగా ఉండే చెత్తతో సంపద తయారీ కేంద్రాల వాళ్లు ఆ వ్యర్థాలను తీసుకెళ్తున్నట్లు సమాచారం.

చిన్నమండెం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి నాలుగు రోజులకు ఒకసారి బయో మెడికల్ వారి వెహికల్ వచ్చి హాస్పిటల్ నుంచి వచ్చిన వ్యర్థాలను తీసుకెళ్తోంది. నాలుగు రోజులకు ఒకసారి ఎల్లో కవర్ 5 కిలోలు, రెండు కలర్ కవర్ మూడు కిలోలు, బ్లూ కలర్ కవర్ ఒక కిలో, వైట్ కలర్ కవర్ 500 గ్రాముల వ్యర్థాలు వస్తాయి. మొత్తం కలిపి 8 నుంచి 10 కిలోలు వ్యర్థాలు ఉంటాయి. ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోజుకు దాదాపు 100 ఓపీలు వస్తాయి. సంబేపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతిరోజూ ఉపయోగించే సిరంజిలు, సెలైన్ బాటిళ్లు, ఇతర వ్యర్థాలను వారంలో రెండు రోజులు చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వాళ్లు తీసుకెళ్తున్నట్లు సమాచారం. ఇక్కడ సీబీఎండబ్ల్యూటీఎఫ్ వాళ్లు రావడం లేదని సమాచారం.

### రూ.1.55 లక్షలకు పెట్టింది రూ.8.50 లక్షలు

వైద్య ఆరోగ్య శాఖాధికారులు ట్రెజరీకి పంపిన బిల్లుల ప్రకారం అనంతపురానికి చెందిన శ్రీవేన్ ఎన్విరాన్ టెక్నాలజీస్ కంపెనీకి (బెనిఫిషీయరీ ఐడి.. 1000268011) నెలకు 5 వేలు చొప్పున 2022 ఏప్రిల్ నుంచి నవంబరు వరకు 8 నెలలకు రూ.40 వేలు చెల్లించాలి. అయితే అధికారులు రూ.4.25 లక్షలు చెల్లించాలని బిల్లు పంపించారు. అలాగే తిరుపతికి చెందిన ఏడబ్ల్యుఎం కన్సల్టింగ్ లిమిటెడ్.. (బెనిఫీషియరీ ఐడి 1000509246) నెలకు రూ.5 వేలు. 2022 జూన్ నుంచి 2023 డిసెంబరు వరకు 23 నెలలకు రూ.1.15 లక్షలు చెల్లించాలి. అయితే రూ.4.25 లక్షలు చెల్లించమని ట్రెజరీకి బిల్లు పంపించారు. రెండూ కలిపి.. రూ.1.55 లక్షలు చెల్లించాల్సి ఉండగా.. రూ.8.50 లక్షలు చెల్లించడానికి బిల్లులు పంపడం గమనార్హం. ఈ బిల్లులను చూసి కళ్లు బైర్లు కమ్మిన ట్రెజరీ అధికారులు వాటిని వెనక్కి పంపారు.

### ఎటువంటి అక్రమాలు లేవు

ఉమ్మడి జిల్లాలోనూ ఇదే పద్ధతి ఉండేది. కొత్తగా జిల్లా ఏర్పడిన 2022 ఏప్రిల్ నుంచి ఇదే పద్ధతి కొనసాగిస్తున్నాం. ఇందులో ఎటువంటి అక్రమాలు జరగడం లేదు. కంపెనీలకు జీఎస్టీ వస్తుంది. కాబట్టి ఇదే పంపించాము.

- కొండయ్య, డీఎంహెచ్‌వో

మదనపల్లె సబ్‌కలెక్టరేట్

# నేడు పునఃప్రారంభం

- హాజరుకానున్న రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె సబ్‌కలెక్టరేట్ బుధవారం పునఃప్రారంభం కానున్నట్లు సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ తెలిపారు. గత ఏడాది జూలై 21వ తేదీ రాత్రి మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌లో ఫైళ్ల దహనం జరిగిన తరువాత సీఐడీ కేసులు, విచారణ, ఆర్‌అండ్‌బీ అధికారులచే మరమ్మతుల అంచనాలు వెరసి మదనపల్లె సబ్‌కలెక్టరేట్ తిరిగి పాలనకు సిద్ధం చేశారు. ఈ క్రమంలో ఏడు నెలల తరువాత సబ్‌కలెక్టరేట్‌ను పునఃప్రారంభించేందుకు రాష్ట్ర రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆర్.పి.సిసోడియా, కలెక్టర్ శ్రీధర్ చామకూరి బుధవారం మదనపల్లెకు రానున్నట్లు సబ్‌కలెక్టర్ తెలిపారు. ఏడు నెలలుగా సబ్‌కలెక్టరేట్ ఆవరణంలోని హెచ్‌ఎన్‌ఎస్ఎస్ కార్యాలయం నుంచే పాలన కొనసాగించారు. ఎట్టకేలకు కోర్టు హాలు, సబ్‌కలెక్టర్ చాంబర్, పరిపాలన భవనాలు సిద్ధం కాగా నేడు పునఃప్రారంభం కానున్నాయి.

# నీలం మామిడిలో.. కానరాని పూత



- పూత కోసం ముమ్మరంగా క్రిమిసంహారక మందులు పిచికారీ
- ఆందోళనలో రైతులు

పెనగలూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రతికూల వాతావరణ పరిస్థితుల వల్ల ఈ యేడు మామిడి తోటల్లో ఆలస్యంగా పూత వస్తోంది. ఈ పాటికి బేనేషా, అంటిమామిడి, పోలూరు, ఖాదర్, మలుగుబ, ఇమామ్ పసంద్, ఢిల్లీ పసంద్, లడ్డూ పసంద్, గద్దమామిడి తదితర రకాల మామిడి చెట్లలో పూత బాగా వచ్చింది. అయితే నీలం రకం మామిడి చెట్లలో ఇంకా పూత రాలేదు. పూతకోసం రైతులు శరవేగంగా క్రిమిసంహారక మందులు పిచికారీ చేస్తున్నారు. సాధారణ వాతావరణ పరిస్థితుల్లో అన్నిరకాల మామిడి చెట్లలో ఈ సమయానికి పిందెలు కనిపించాల్సి ఉండగా ప్రతికూల వాతావరణ పరిస్థితుల వల్ల ఈ యేడాది అన్నిచోట్ల ఆలస్యంగా పూత వచ్చింది. అయితే నీలం చెట్లలో మాత్రం ఇంకా పూత రాలేదు. పూత కోసం రైతులు వ్యవసాయ మందులు, షాపుల వరకు పరుగులు తీస్తూ డీలర్లు చెప్పిన మందులను పిచికారీ చేస్తున్నారు. ఒకదఫా అయిపోయి రెండో దఫా కూడా మందులను పిచికారీ చేస్తున్నారు. ఇదిలా ఉండగా మామిడి తోటల్లో ఫలరాజుగా గుర్తింపు కలిగిన బేనీషా పండ్ల తర్వాత అంతటి ఆదరణ కలిగిన కాయలు నీలం రకానికి చెందినవే. పలురకాల కాయలన్నీ జూన్ మాసానికంతటికి సీజన్ ముగిసిపోగా అప్పటికే కోతకు సిద్ధంగా ఉన్న నీలం మామిడికాయలు అంత త్వరగా చెడిపోవు. కాయలు పక్వానికి వచ్చినా ఒకటిన్నర నెలదాకా చెట్లపైన మాగకుండా అలాగే ఉండిపోతాయి. అందువల్ల మామిడి తోటలు సాగుచేసిన రైతులు 80 శాతం తోటలు, చెట్లు నీలం రకానికి చెందినవే ఉంటాయి. రైతులకు, వ్యాపారులకు మంచి లాభాలు తెచ్చి పెట్టే రకం కూడా నీలం కాయలే. నీలం కాయల కోత సీజన్ ప్రారంభమైనప్పటి నుంచి ముగింపు దాకా దాదాపు రెండు నెలల కూలీలకు చేతినిండా పని ఉంటుంది. ఈ సమయంలోనే కమీషన్ ఏజెంట్లు, వ్యాపారులు కూడా బాగా లాభాలు ఆర్జిస్తూ ఉంటారు. ఇతర రాష్ట్రాలు, దేశాలకు కూడా నీలంకాయలు బాగా ఎగుమతి అవుతూ ఉంటాయి. నీలం మామిడి పండు తినడానికి అన్నిరకాల మామిడి పండ్ల కంటే చాలా మధురంగా ఉంటుంది. పేద ప్రజలు కొనుగోలుకు కూడా నీలం, మామిడికాయల ధరలు అనుకూలంగా ఉంటాయి. అందువల్ల అన్నిరకాల ప్రజలు నీలం మామిడికాయలను తినేందుకు బాగా ఇష్టపడతారు. అయితే ఈ యేడు ప్రతికూల వాతావరణం పరిస్థితుల వల్ల ముందుగా పూత రావాల్సిన మామిడి చెట్లే ఆలస్యంగా వస్తున్నది. నీలం రకం మామిడి చెట్లు కూడా ఆలస్యమైనా సరే పూత వచ్చి బాగా కాయలు కాస్తాయని రైతులు ఆశతో ఎదురు చూస్తున్నారు.

సింగనమల వద్ద పూత రాని నీలం రకం మామిడి తోట

### పూత కోసం నీళ్లు కడుతున్నాం



నీలం చెట్లలో కూడా ఈ పాటికి పూత బాగా రావాల్సి ఉంది. చెట్లకు నీళ్లు కడితే వెంటనే పూత వస్తుందని నీళ్లు కడుతున్నాం. డిసెంబరు నెలాఖరు వరకు వర్షాలు బాగా కురిసి నేలలన్నీ పదునులోనే ఉన్నాయి. తోటలకు నీళ్లు కట్టినా కట్టకపోయినా ఆలస్యంగానైనా పూత వస్తుందన్న నమ్మకం ఉంది. ఈ యేడు ఎప్పుడు పూతకు రాని సంకరజాతి చెట్లు కూడా పూత వస్తున్నాయి. దాన్ని బట్టి నీలం చెట్లను అనుమానించాల్సిన అవసరం లేదు.

- కాలి వెంకటేశు, రైతు, కంబాలకుంట బీసీ కాలనీ, పెనగలూరు



తూర్పుపల్లెలో క్రిమిసంహారక మందులు పిచికారీ చేస్తున్న దృశ్యం

### నీలంలో కచ్చితంగా పూత వస్తుంది



సాధారణంగా ఎప్పుడైనా నీలం మామిడిలో పూత ఆలస్యంగానే వస్తుంది. ఈ యేడు అన్నిరకాల మామిడిలో పూత ఆలస్యంగా వచ్చింది. రైతులు చింతించాల్సిన అవసరం లేదు. నీలం మామిడి చెట్లలో కూడా ఈ పాటికి సన్నని మొగ్గ ఏర్పడుతోంది. ఇంకో పదిరోజులు దాటిన తర్వాత మొగ్గ బాగా కనిపిస్తుంది. ఇప్పటి వాతావరణానికి అనుగుణంగా రైతులు సస్య రక్షణ చర్యలు చేపట్టాల్సి ఉంటుంది.

- సురేష్‌బాబు, ఉద్యానశాఖ అధికారి

## భూకబ్జాలను అరికట్టండి

- కడప ఆర్డీవోను ఆదేశించిన జేసీ అదితిసింగ్



భూకబ్జాలను అరికట్టాలని ఆర్డీవోను ఆదేశిస్తున్న జేసీ

సిద్దవటం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పరపల్లె మాధవరం-1 గ్రామ పంచాయతీల్లో భూ కబ్జాలను అరికట్టాలని కడప ఆర్డీవో జాన్‌ఇర్విన్‌ను జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ ఆదేశించారు. సిద్దవటం తహసీల్దారు కార్యాలయంలో మంగళవారం రెవెన్యూ సదస్సులపై జేసీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గురు, శుక్రవారం జిల్లాలోని రెండు మండలాలు తనిఖీ చేసి సిబ్బంది పనితీరు పర్యవేక్షిస్తున్నామన్నారు. సిద్దవటం తహసీల్దారు కార్యాలయంలో రెవెన్యూ సదస్సులు, రీసర్వే, ఫిర్యాదుల పరిష్కారం, సిబ్బంది పనితీరుపై ఆరా తీశామన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దవటం ఇన్‌చార్జి తహసీల్దారు మాధవీలత, ఆర్ఐ ప్రసాద్, వీఆర్వోలు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

## విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా సెక్రటరీగా శంకర్



సన్మానం అందుకుంటున్న జిల్లా విశ్రాంత ఉద్యోగ సంఘం నాయకులు

వాల్మీకిపురం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): జిల్లా విశ్రాంత ఉద్యోగుల సంఘం జనరల్ సెక్రటరీగా వలిగిరి శంకర్ నియమితులయ్యారు. నూతన కార్యవర్గం ఎన్నికైన సందర్భంగా మంగళ వారం విజయవాడలోని రెవెన్యూ భవన్‌లో జిల్లా అధ్యక్షుడు రాజగోపాల్‌రెడ్డితో కలిసి ఆయన రాష్ట్ర అధ్యక్షుడు పీఎస్ఎస్ఎన్ శాస్త్రి చేతుల మీదుగా సన్మానం, సత్కారాలు అందుకున్నారు. ఈ సందర్భంగా వలిగిరి శంకర్ మాట్లాడుతూ రాష్ట్ర కార్యవర్గం తనపై ఉన్న నమ్మకంతో ఇచ్చిన పదవికి న్యాయం చేస్తానని, విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన జిల్లా అధ్యక్షుడు, సంఘ నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ముగ్గురికి తీవ్రగాయాలు

రామాపురం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): కర్నూలు- చిత్తూరు 40వ జాతీయ రహదారిలోని రామాపురం మండలం బండపల్లి పంచాయతీ జగనన్న కాలనీ సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండు స్కూటర్లు ఢీకొని వెంకటసుబ్బరాయుడు, బండి వెంకటసుబ్బరాయుడు, శ్రీనివాసులకు తీవ్ర గాయాలైనట్లు ఎస్ఐ వెంకటసుధాకర్‌రెడ్డి తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని ఓబుల్‌రెడ్డిగారిపల్లెకు చెందిన పై ముగ్గురు కూలి పనికోసం జగనన్న కాలనీకి స్కూటర్‌లో వెళ్తుండగా.. మార్గమధ్యంలో బండపల్లి పంచాయతీలోని జగనన్న కాలనీ సమీపానికి రాగానే కడప వైపు నుంచి రాయచోటి వైపు బైకులో వెళ్తున్న కడపకు చెందిన మౌలా వెనుక వైపు నుంచి ఢీకొన్నాడు. ఈ సంఘటనలో ముందు వెళ్తున్న ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. సంఘటన స్థలానికి పోలీసులు చేసుకొని గాయపడిన వారికి ప్రథమ చికిత్స కోసం రాయచోటి ఆసుపత్రికి 108 ద్వారా తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటసుధాకర్‌రెడ్డి తెలిపారు.

## వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

- మాజీ సీఎం నల్లారి కిరణ్‌కు వినతి



కిరణ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న వాల్మీకి సంఘం నాయకులు

వాల్మీకి పురం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరుతూ వాల్మీకి సంఘం నాయకులు మంగళ వారం కలికిరిలో మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వాల్మీకి సేవా సమితి వాల్మీకిపురం మండల అధ్యక్షుడు విష్ణుచైతన్య మాట్లాడుతూ రాష్ట్రంలోని వాల్మీకుల పరిస్థితిని గమనించి, వారిని ఎస్టీ జాబితాలోకి చేర్చే విధంగా కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. ఇందుకు స్పందించిన ఆయన మాట్లాడుతూ వాల్మీకులకు న్యాయం జరిగేలా, వాల్మీకుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చినట్లు సంఘ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు గంగులప్ప, రాజేంద్రప్రసాద్, గణి, బాలు, భరత్, రామకృష్ణ, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతి నుంచి గల్ఫ్‌కు విమాన సర్వీసులు ప్రారంభించాలి

- కేంద్ర మంత్రికి కుడా చైర్మన్ ముక్కా వినతి



కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడుకు వినతిపత్రం ఇస్తున్న ముక్కా

రైల్వేకోడూరు రూరల్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): తిరుపతి నుంచి గల్ఫ్‌కు విమాన సర్వీసులు ప్రారంభించాలని కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడుకు కడప అర్బన్ డెవలప్‌మెంటు అథారిటీ చైర్మన్, కోడూరు టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి వినతిపత్రం అందజేశారు. మంగళవారం విజయవాడలోని కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు నివాసంలో ఆయనను, రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అటు రైల్వే కోడూరు నియోజకవర్గం ఉమ్మడి జిల్లాలో ఎక్కువ మంది గల్ఫ్ దేశాలకు వెళ్లి జీవనం సాగిస్తున్నారని తెలిపారు. గల్ఫ్ నుంచి స్వదేశానికి చెన్నై విమానాశ్రయం నుంచి వస్తూ చాలా మంది ప్రమాదాలు జరిగి మరణిస్తున్నారని, తిరుపతి విమానాశ్రయం నుంచి గల్ఫ్‌కు సర్వీసులు ప్రారంభిస్తే జిల్లా ప్రజలకు అనువుగా ఉంటుందని తెలిపారు. కాగా త్వరలోనే గల్ఫ్‌కు విమాన సర్వీసులు ప్రారంభిస్తామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు.

## అంగన్వాడీలకు శిక్షణ కార్యక్రమం



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈవో సుబ్రమణ్యం

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో అంగన్వాడీలకు 120 రోజుల సర్టిఫికెట్ కోర్స్ శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి డీఈఓ సుబ్రమణ్యం, ఉపవిద్యాశాఖ అధికారి శివప్రకాశ్‌రెడ్డి, కోర్స్ కోఆర్డినేటర్, ఎంఈఓలు బాలాజీనాయక్, వెంకటశివారెడ్డి, ఐసీడీఎస్ పీడీ రమాదేవి, డీఆర్పీలు హాజరయ్యారు. ఈ శిక్షణను ఉద్దేశించి డీఈఓ మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రాథమిక దశలో అభ్యసన సామర్థ్యాలను పెంపొందింపచేస్తే ఉన్నత దశలలో సంపూర్ణ అభివృద్ధి జరుగుతుందని తెలియజేశారు. అనంతరం ఉప విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ జ్ఞానజ్యోతి కార్యక్రమం ఆవశ్యకతను తెలియజేశారు. అనంతరం కోర్సు కోఆర్డినేటర్, ఎంఈఓ మాట్లాడుతూ ప్రాథమిక దశలో విద్యార్థుల హాజరుశాతాన్ని పెంపొందించాలన్నా, విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు మెరుగుపర్చాలన్నా పునాది అభ్యసనం అంగన్వాడీ కార్యకర్తలుగా మీకు మీరేసాటి అంటూ కార్యక్రమం సారాంశాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌పీలు రాజారమేశ్, వెంకటసుబ్బయ్య, సికిందర్, నాగమణి, సుగుణ, శివజ్యోతి, ఎఫ్ఎల్ఎన్ కోఆర్డినేటర్ రాజశేఖర్, సీఆర్పీలు అరుణ్ బాబు, రవిప్రకాశ్ పాల్గొన్నారు.

## రూ.5.51 లక్షలకు తలనీలాల వేలం

సిద్దవటం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): నిత్యపూజస్వామికి భక్తులు సమర్పించుకునే తలనీలాలు సేకరించుకునే హక్కులను అద్దంకి గ్రామానికి చెందిన మహేంద్ర రూ.5.51 లక్షలకు దక్కించుకున్నారని ఆలయ ఈవో మోహన్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని రంగనాయకస్వామి ఆలయంలో మంగళవారం దేవదాయ, ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో ఇందుకు సంబంధించి వేలంపాటను నిర్వహించారు. గతేడాది ఈ హక్కుల ద్వారా రూ.5.85 లక్షలు ఆదాయం రాగా ఈ ఏడాది రూ.34 వేలు తగ్గింది. ఈ కార్యక్రమంలో రాజంపేట దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శివయ్య, ఆలయ కమిటీ చైర్మన్, సిబ్బంది చంద్ర, వంతాటిపల్లె గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



వేలం నిర్వహిస్తున్న ఎండోమెంట్ అధికారులు

## 'మిషన్ వాత్సల్య'ను కట్టుదిట్టంగా అమలు చేయాలి

- కలెక్టర్ చామకూరి శ్రీధర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

రాయచోటి(కలెక్టరేట్), ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మిషన్ వాత్సల్య కార్యక్రమాన్ని పిల్లల సంక్షేమమే ధ్యేయంగా కట్టుదిట్టంగా అమలు చేయాలని, జిల్లాలో బాల్యవివాహాలను రూపుమాపాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ అధ్యక్షతన, మిషన్ వాత్సల్య కార్యక్రమంపై జిల్లా స్థాయి బాలల సంక్షేమం, పరిరక్షణ కమిటీ సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా స్త్రీ, శిశు సంక్షేమశాఖ అధికారి రమాదేవి ఈ సమావేశాన్ని ప్రారంభిస్తూ మిషన్ వాత్సల్య కార్యక్రమంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు జిల్లాలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి శిశు సంక్షేమం, పరిరక్షణ కమిటీని ఏర్పాటు చేసుకున్నామన్నారు. అలాగే గ్రామ, వార్డు స్థాయిల్లో సర్పంచ్ అధ్యక్షతన పోలీస్, రెవెన్యూ తదితర శాఖల అధికారులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసుకున్నామన్నారు. ఈ సమావేశంలో రాజంపేట అడిషనల్ ఎస్పీ మనోజ్ రామనాథ్‌హెగ్డే, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమశాఖ అధికారి రమాదేవి, రాయచోటి మున్సిపల్ కమిషనర్ వాసు, మదనపల్లె, బి.కొత్తకోట మున్సిపల్ కమిషనర్లు, జీఎస్‌డబ్ల్యుఎస్, విద్య, వైద్య, సాంఘీక సంక్షేమ, వెనుకబడిన తరగతుల శాఖ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## భర్త వేధింపుల నుంచి రక్షణ కల్పించండి

- ఎస్పీకి ఫిర్యాదు చేసిన మదనపల్లె మహిళ



ఎస్పీకి ఫిర్యాదు చేసిన అనంతరం మీడియాతో మాట్లాడుతున్న బాధితురాలు పార్వతమ్మ

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): 'నా భర్త నాకు కాలయముడిగా తయారయ్యాడని, అతని వేధింపుల నుంచి నాకు రక్షణ కల్పించాలంటూ' జిల్లా పరిధిలోని మదనపల్లె పట్టణం పెంచిపాడులో నివాసముంటున్న పి.భాస్కర్ భార్య పి.పార్వతమ్మ సోమవారం ఎస్పీ విద్యాసాగర్‌నాయుడుకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు వివరాల్లోకి వెళితే.. మదనపల్లె పట్టణం పెంచిపాడుకు చెందిన భాస్కర్‌తో 23 సంవత్సరాల క్రితం పార్వతమ్మకు వివాహమైంది. అప్పటి నుంచి అన్యోన్యంగా ఉన్న భార్యభర్తల మధ్య గత ఆరేళ్లుగా గొడవలు మొదలయ్యాయి. పార్వతమ్మ భర్త భాస్కర్ మదనపల్లె పట్టణంలోని ఎస్టేట్‌లో ఉన్న గార్మెంట్‌లో మేనేజర్‌గా పని చేస్తూ అక్కడే పనిచేస్తున్న ఓ మహిళతో అక్రమ సంబంధం పెట్టుకుని ప్రతిరోజు పార్వతమ్మను చిత్రహింసలకు గురిచేస్తుండేవాడని తెలిపింది. ఈ నేపథ్యంలోనే తనపై పలుమార్లు దాడి చేసి బెల్టుతో, చెప్పులతో కొడుతూ చంపేందుకు ప్రయత్నం చేస్తూ తనను ఇంటి నుంచి పుట్టింటికి తరిమేశాడని ఫిర్యాదులో వివరించారు. తనకు ఇద్దరు పిల్లలు ఉన్నారని, తమ కుటుంబ బాగోగులు చూడకుండా తన భర్త భాస్కర్ తనను వేధింపులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అదనపు కట్నం మరో రూ.10 లక్షలు తీసుకురావాలని చిత్ర హింసలకు గురిచేస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. తన భర్తతో పాటు అతనితో వివాహేతర సంబంధం పెట్టుకున్న మహిళతో తనకు ప్రాణహాని ఉందని, వారి బారి నుంచి రక్షణ కల్పించాలంటూ పార్వతమ్మ ఎస్పీకి ఇచ్చిన ఫిర్యాదులో విజ్ఞప్తి చేశారు. బాధితురాలు వెంట ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తోపు కృష్ణప్ప, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి మండెం సుధీర్‌కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు మల్లికార్జున, శ్రీరాములు, రామప్ప, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగ భద్రత కల్పించండి

- సీఎం చంద్రబాబుకు వైద్యమిత్రల వినతి
- నల్లరిబ్బన్లతో విధులకు హాజరు



నల్ల రిబ్బన్లతో నిరసన తెలుపుతున్న వైద్య మిత్రలు

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): చాలీచాలని వేతనాలతో 17 ఏళ్లుగా పనిచేస్తున్నాం. కుటుంబ పోషణ జరగక, పిల్లలను సక్రమంగా చదివించుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.. తమకు ఉద్యోగ భద్రత కల్పించి ఆదుకోవాలని డాక్టర్ ఎన్‌టీఆర్ వైద్యసేవ పథకంలో పనిచేస్తున్న వైద్యమిత్రలు, టీం లీడర్లు, ఆఫీసు అసోసియేట్లు, జిల్లా మేనేజర్లు సీఎం చంద్రబాబునాయుడును వేడుకొంటున్నారు. మంగళవారం వారు జిల్లా వ్యాప్తంగా నల్లరిబ్బన్లు తగిలించుకొని విధులకు హాజరై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా చిత్తశుద్ధితో, సేవాభావంతో ప్రజలకు సేవలందిస్తున్నామన్నారు. ఎందరో ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపిన చంద్రబాబు తమ జీవితాల్లో కూడా వెలుగులు నింపాలని వారు అభ్యర్థించారు. ఎన్‌టీఆర్ వైద్యసేవ పథకాన్ని ఇన్సూరెన్స్ మోడ్‌లోకి బదలాయింపు చేసిన పథకంలో పనిచేస్తున్న వైద్య మిత్రలు, టీం లీడర్లు, ఆఫీసు అసోషియేట్లు, జిల్లా మేనేజర్ తదితర క్షేత్ర స్థాయి సిబ్బంది ఉద్యోగాలకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూడాలని, వేతనాలు పెంచి, ఉద్యోగ భద్రత కల్పించాలని వారు ముఖ్యమంత్రికి విన్నవించారు.

## అగ్ని ప్రమాదంలో రైతుకు అపార నష్టం

- చేతికందిన మొక్కజొన్న పంట అగ్నికి ఆహుతి
- రూ.4 లక్షలకు పైగా నష్టం
- ట్రాన్స్‌ఫార్మర్, మోటర్, కేబుల్ వైర్లు బుగ్గిపాలు

పెద్దతిప్పసముద్రం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఓ రైతు భూమిని లీజుకు తీసుకుని అప్పు చేసి పెట్టుబడులు పెట్టి సాగు చేసిన మొక్కజొన్న పంట అగ్ని ప్రమాదంలో కాలిపోవడంతో ఆ రైతుకు భారీ నష్టం వాటిల్లింది. చేతికందిన పంట అగ్నికి ఆహుతి కావడంతో ఆ రైతు కుటుంబం కన్నీటి పర్యంతమైంది. స్థానికుల కథనం మేరకు పెద్దతిప్పసముద్రం మండలం మద్దయ్యగారిపల్లెకు చెందిన మాజీ సర్పంచ్ నరసింహులు తనకు భూమి తక్కువగా ఉండడంతో ఆరు ఎకరాల భూమిని లీజుకు తీసుకుని అందులో నాలుగెకరాల్లో మొక్కజొన్న పంటను సాగు చేశాడు. పంట కూడా బాగా ఏపుగా పెరిగింది. దీంతో ఒకటి రెండు రోజుల్లో పంట కోద్దామని అనుకున్నారు. అయితే మంగళవారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తులు ఎవరో పొలం వద్ద నిప్పు పడేసినట్లు సమాచారం. అది కాస్త పంటకు వ్యాపించడంతో పంట అగ్నికి ఆహుతైంది. సమాచారాన్ని పరిసర ప్రాంత రైతులు నరసింహులుకు తెలియజేయడంతో ఆయన అగ్నిమాపక శాఖ వారికి సమాచారం అందించి మంటలను ఆర్పేందుకు ముమ్మరంగా ప్రయత్నాలు చేశారు. అయితే బాగా పండిన పంట కావడంతో మంటలు అదుపులోకి రాక రెండు ఎకరాలకు పైగా పంట పూర్తిగా కాలిపోయింది. పంటతో పాటుగా ట్రాన్స్‌ఫార్మర్, కేబుల్ వైర్లు, బోరు మోటర్ పైపులు అగ్నికి ఆహుతయ్యాయి. దీంతో దాదాపు రూ.4 లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్లు రైతు నరసింహులు కుటుంబ సభ్యులు బోరున విలపించారు. ప్రభుత్వం స్పందించి ఆ రైతును ఆదుకోవాలని స్థానిక రైతులు ప్రభుత్వాన్ని కోరారు.







పూర్తిగా కాలిపోయిన మొక్కజొన్న పంట, కాలిపోయిన పైపులైన్, మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

# మోసపోతున్నా... మార్పు రాదా!

జనం సొమ్మునే పెట్టుబడిగా పెట్టి నిర్వహిస్తున్న ప్రైవేటు చీటీల వ్యాపారం జిల్లాలో మూడు పువ్వు లు ఆరుకాయలుగా సాగుతోంది. ఎలాంటి అనుమతులు లేకపోయినా కొందరు ప్రైవేటుగా చీటీలు నిర్వహిస్తూ.. రూ.కోట్లలో డబ్బులు వసూళ్లు చేసి ఉన్నఫలంగా కుచ్చుటోపీ పెట్టి పరారవుతున్నారు. దీంతో లబోదిబోమంటూ బాధితులు పోలీసులను ఆశ్రయిస్తున్నారు. అయితే వీరి వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో పోలీ సులు తలలు పట్టుకుంటున్నారు. ఇలాంటి సంఘటనలు తరచూ జరుగుతున్నా చీటీల వ్యాపారం షరా మామూలే అన్నట్లు సాగుతోంది.

- జోరుగా ప్రైవేటు చీటీల వ్యాపారం
- రూ.లక్షల్లో వసూళ్లు చేసి.. నిర్వాహకులు పరారీ
- పోలీసులను ఆశ్రయిస్తున్న బాధితులు
- ఆధారాలు లేక... తలలు పట్టుకుంటున్న పోలీసులు



కడప క్రైం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి):కడపతో పాటు జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో అనుమతి లేని చీటీ లు ఎక్కువ నిర్వహిస్తున్నట్లు తెలుస్తుంది. కడప నగరంలోని చిన్నచౌకు, మృత్యుంజయకుంట, ఓంశాంతినగర్, శంకరాపురం, అక్కాయపల్లె, ఐటీఐ సర్కిల్, నబీకోట, రాజారెడ్డివీధి, మాసాపేట, అంగడివీధి, శంకరాపురం, ప్రొద్దుటూరు, మైదుకూరు, పోరుమామిళ్ల, జమ్మలమడుగు, పులివెందుల, బద్వేలు ఇలా ప్రతి ప్రాం తంలో వీధికొకరు చీటీలు నిర్వహిస్తున్నారు. అయితే తరచూ జిల్లాలో ఎక్కడో ఓ చోట నిర్వాహకులు రాత్రికి రాత్రే కుచ్చుటోపి పెట్టి పరారవుతన్నారు. దీంతో బాధితులు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించి తమ గోడు వెల్లబోసుకుంటున్నారు. అందులో ఇటీవల జరిగిన కొన్ని సంఘటనలను పరిశీలిస్తే..

కడప నగరంలోని అక్కాయపల్లెలో భార్యా భర్త చీటీలు వేసి రూ.కోట్లు వసూళ్లు చేసి ఆపై బోర్డు తిప్పి పరారీ అయ్యా రు. డబ్బు కట్టినట్లుగా బాధితుల వద్ద ఎలాంటి ఆధారాలు లేవు. ఈ వ్యవహారంపై పలువురు తాలుకా పోలీసులను ఆశ్రయించడంతో దంపతులపై చీటింగ్ కేసు నమోదు చేసి ఇటీవల నిర్వాహకుడిని అరెస్టు చేశారు. కడప నగరం నాగరాజుపేటలో ఓ మహిళ రెండు నెలల క్రితం చీటీలు వేసి భారీ ఎత్తున సభ్యుల నుంచి డబ్బులు వసూళ్లు చేసుకుని పరారైంది. ఇదే ఏరియాలో మరో వ్యక్తి కోట్ల రూపాయలు చీటీలు వేసి చివరికి ఐపీ దాఖలు చేసి పరారయ్యాడు. కడప నగరంతో పాటు జిల్లాలో తరచూ ఇలాంటి మోసాలు బయటపడుతున్నాయి. అయితే బాధితులు దగ్గర సరైన ఆధారాలు లేకపోవడంతో పోలీసులు ఏం చేయాలో అర్థకంకాక తలలు పట్టుకుంటున్నారు.

**అనుమతులు లేకుండా నిర్వహణ**

ప్రైవేటు చీటీల వ్యాపారానికి ప్రభుత్వ అనుమతి లేకపోయినా యథేచ్ఛగా నిర్వహిస్తున్నారు. నమ్మకమే పెట్టుబడిగా ఈ దందా సాగుతుండడంతో అటు అధికారులు, పోలీసులు కూడా వీటిని కట్టడి చేయలేకపోతున్నారు. ఇటీవల కడప తాలుకా పరిధిలో చీటీల వ్యాపారం చేసి బోర్డు తిప్పిన ఓ దంపతులకు కడప కోర్టు జైలు శిక్ష విధించడంతో పాటు జరిమానా కూడా విధించింది. అలాగే రాజారెడ్డివీధికి చెందిన మరో ఇరువురికి కూడా కోర్టులో శిక్ష పడింది. అయినా కొందరిలో మార్పు కనిపించడంలేదు. ముఖ్యంగా ఈ చీటీల ఉచ్చులో మహిళలే ఇరుక్కుంటున్నారు. చట్టపరిధిలో అనుమతి పొందిన చీటీల్లోని సభ్యులకు కచ్చితంగా ఆర్థికపరమైన భద్రత ఉంటుంది. చట్టబద్ధత లేని చీటీ వ్యాపా రంతో ప్రజల జీవితాలు నాశనం అవుతున్నాయి. ముఖ్యంగా మధ్యతరగతి మహిళలు చీటీల నిర్వాహకుల ఉచ్చులో పడి మోసపోతున్నారు.

**చీటీల వ్యాపారుల మాటలు నమ్మి మోసపోవద్దు**

ఎవరూ కూడా ప్రైవేటు చీటీలు వేసి మోసపోవద్దు. ముఖ్యంగా ప్రైవేటు చీటీలపై మహిళలే డబ్బులు చెల్లిస్తూ ఉన్నారు. చట్టబద్ధత ఉన్న వాటిల్లోనే డబ్బులు కట్టాలి. ఈ ప్రైవేటు చీటీలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

-వెంకటేశ్వర్లు, కడప డీఎస్పీ

## గండికోటను సందర్శించిన రాష్ట్ర పర్యాటకశాఖ కార్యదర్శి



గండికోటలో ధాన్యాగారాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర పర్యాటక శాఖ కార్యదర్శి అజయ్‌జైన్, కలెక్టర్ శ్రీధర్, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి

జమ్మలమడుగు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): పర్యాటక ప్రాంతమైన గండికోటను మంగళవారం రాష్ట్ర పర్యాటక శాఖ కార్యదర్శి అజయ్‌జైన్, కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి ఇతర అధికారులు సందర్శించారు. ముందుగా వారు గండికోటలోని ఏపీ టూరిజం హోటల్ వద్ద పరిశీలించారు. గతంలో ఆగిపోయిన రోప్‌వే పిల్లర్స్‌ను, లోయ పక్కనే అనుమతి లేకుండా వేసిన టెంట్లను పరిశీలించారు. అనంతరం గండికోటలోని ధాన్యాగారాన్ని, రంగనాథస్వామి, మాధవరాయస్వామి ఆలయాలను సందర్శించారు. పర్యాటక అభివృద్ధి ప్రణాళికలో భాగంగా ఒబేరాయ్ స్టార్‌హోటల్ నిర్మించే ప్రాంతాన్ని, గండికోట రిజర్వాయర్ బ్యాక్‌వాటర్, తదితర వాటికి సంబంధించి చర్చించారు. అడ్వెంచర్ ప్రాంతంలో చేపట్టే బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించి పరిశీలించారు. ఆర్డీవో సాయిశ్రీ, తహసీల్దారు శ్రీనివాసులరెడ్డి, టూరిజం అధికారి సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ట్రాన్స్‌ఫార్మర్లలో రాగితీగ చోరీ చేసే దొంగల అరెస్టు



పట్టుబడ్డ దొంగలను చూపుతున్న పోలీసులు

చక్రాయపేట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ ప్రాంతాలలో ట్రాన్స్‌ఫార్మర్లలోని రాగితీగను చోరీచేసే దొంగలను పోలీసులు అరెస్టు చేశా రు. పులివెందుల డీఎస్పీ, సీఐల ఆదేశాల మేరకు ట్రాన్స్‌ఫార్మర్‌ల దొంగలపై నిఘా పెట్టిన చక్రాయపేట ఎస్ఐ కృష్ణయ్య మంగళవారం ఇద్దరు దొంగలను అరెస్టు చేశారు. వివరాల్లోకెళితే... చెన్నూరు మండలం రుద్రభారత్‌పేట శాటిలైట్ సిటీకి చెందిన ఇ.మల్లికార్జున, శంకర్‌లు గత కొన్ని రోజులుగా ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి అందులోని రాగితీగను చోరీ చేసే వారు. ఈ నేపథ్యంలో చక్రాయపేట ఎస్ఐ తమ సిబ్బందితో గాలివీడు క్రాస్ వద్ద ఎస్ఐ తమ సిబ్బందితో వాహనాలను తనిఖీ చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు మోటర్ బైకులో నాగులగుట్టపల్లె వైపు పరుగులు తీశా రు. వారిని వెంబడించి పట్టుకొని తమదైన శైలిలో విచారించగా చక్రాయపేట మండలంలో మూడు ట్రాన్స్‌ఫార్మర్‌లను దొంగలించామని తెలిపారు. అలాగే జిల్లాలోని వేముల, వేంపల్లె, లింగాల, పెండ్లిమర్రి, పులివెందుల, చింతకొమ్మదిన్నె, జమ్మలమడుగు, ముద్దనూరు, ఖాజీపేట, రిమ్స్, జమ్మలమడుగు, మైలవరం, పెండ్లిమర్రి ప్రాంతాలలో 27 ట్రాన్స్‌ఫార్మర్‌లను పగులగొట్టి వాటిలోని రాగివైర్లను దొంగలించామని ఒప్పుకున్నారు. ఈ మేరకు కడప ఎయిర్ పోర్టు వద్ద కంపచెట్లలో దాచిన సుమారు 180 కేజీల రాగివైరు, ట్రాన్స్‌ఫార్మర్లను విప్పడానికి వాడే పరికరాలను, పల్సర్ బైకును స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా చక్రాయపేట పోలీసులను డీఎస్పీ, సీఐలు అభినందించారు.

## బొలేరో క్యాంపర్ ఢీ.. 14 గొర్రెలు మృతి



కడప-తాడిపత్రి ప్రధాన రహదారిపై మృతి చెందిన గొర్రెలు

కొండాపురం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండ్లూరు గ్రామం వద్ద మంగళవారం బొలెరో క్యాంపర్ వాహనం ఢీకొనడంతో 14 గొర్రెలు మృతి చెందాయి. మండలంలోని చౌటిపల్లె గ్రామానికి చెందిన పుల్లగూర సుబ్బారెడ్డి అనే రైతు కడప-తాడిపత్రి ప్రధాన రహదారిపై గొర్రెలను మేపు కోసం తీసుకెళుతుండగా ఆదోనికి వంటనూనె లోడుతో వెళుతున్న బొలెరో క్యాంపర్ వేగంగా గొర్రెలమందను ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాయి. వీటి విలువ సుమారు రూ.2లక్షల వరకు ఉంటుందని తెలిపారు. తనకు జీవనధారమైన గొర్రెలు మృతి చెందడంతో బోరున విలపిస్తున్నాడు. ప్రభుత్వం తగిన ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని కోరుతున్నాడు.

## పదో తరగతి విద్యార్థిని ఆత్మహత్య



కడప(క్రైం), ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): కడప నగరం వైఎస్ఆర్ కాలనీకి చెందిన సుచిత్ర (15) అనే విద్యార్థిని మంగళవారం ఇంట్లో ఎవరూలేని సమ యంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు చిన్నచౌకు ఎస్ఐ రవికుమార్ తెలిపారు. ఆయన వివరాల మేరకు.. వైఎస్ఆర్ కాలనీలో నివాసం ఉంటున్న దేవ కుమార్, ప్రభావతిల కుమార్తె సుచిత్ర మున్సిపల్ మెయిన్ స్కూల్‌లో పదో తరగతి చదువుకుటుంది. సుచిత్ర అనార్యోగంతో సరిగా స్కూల్‌కు వెళ్లేదికాదు. ఈక్రమంలో హాజరు సరిగా లేకపోవడంతో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థిని తల్లిదండ్రులకు ఫోన్ చేసి చెప్పారు. దీంతో కలతచెంది మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

## విద్యుత్ వైర్లు తగిలి టిప్పర్ దగ్ధం

ఎర్రగుంట్ల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నదండ్లూరు గ్రామం వద్ద విద్యుత్ వైర్లు తగిలి టిప్పర్ దగ్ధమైంది. చిన్నదండ్లూరు గ్రామానికి నిర్మిస్తున్న రోడ్డుకు టిప్పర్ ద్వారా మట్టిని తోలుతున్నారు. టిప్పర్ అన్‌లోడ్ చేసే సమయంలో విద్యుత్ వైర్లు తగలడంతో మంటలు వ్యాపించి పూర్తిగా కాలిపోయింది. ఫైర్ ఇంజిన్ వచ్చి ఆపేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. కాగా, విద్యుత్‌షాక్‌కు గురైన డ్రైవర్ భయపడి కిందకు దూకడంతో గాయపడ్డాడు. అతనిని చికిత్స నిమిత్తం ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు.

## పూర్వ ప్రాథమిక విద్య బలోపేతానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ నిత్యానందరాజు

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ బలోపేతానికి పూర్వ ప్రాథమిక విద్య ప్రథమ ప్రాధాన్యత వహిస్తుందని సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ నిత్యానందరాజు సూచించారు. మంగళవారం కడప నగరం జయనగర్ కాలనీ నగరపాలక ఉన్నత పాఠశాలలో అంగన్వాడీ వర్కర్స్ ఆరు రోజుల శిక్షణ కార్యక్రమం జిల్లా సమగ్ర శిక్ష, ఐసీడీఎస్ సంయుక్త ఆధ్వర్యం లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాశాఖకు అంగన్వాడీకి అనుసంధానంగా పనిచేయాలని.. అప్పుడే పూర్వ ప్రాథమిక విద్య నుంచి ప్రాథమిక విద్య, మాధ్యమిక విద్య, ఉన్నత విద్య బలోపేతం చెందుతాయన్నారు. కడప మండల విద్యాశాఖ అధికారి దుద్దికుంట గంగిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థలో సమూల మార్పుల్లో భాగంగా న్యూ క్లస్టర్ విధానంలో బేసిక్ ప్రైమరీ స్కూళ్లకు అంగన్వాడీలను అనుసంధానం చేస్తూ పూర్వ ప్రాథమిక విద్య, ప్రాథమిక విద్యను బలోపేతం చేసేందుకు ఈకార్యక్రమం ప్రారంభించినట్లు తెలిపారు. జిల్లా జ్ఞానజ్యోతి డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ కిరణ్ రథం, రీసోర్స్ పర్సన్ శోభారాణి, సూపర్‌వైజర్ ప్రశాంతిలు ప్రసంగించారు. కార్యక్రమంలో కడప నగరంలోని ఆరు సెక్టార్ల సూపర్‌వైజర్లు, రీసోర్స్ పర్సన్లు తదితరులు పాల్గొన్నారు.

## భారతీయ సంస్కృతికి నిదర్శనం రామాయణం



ప్రారంభోత్సవ కార్యక్రమంలో వైవీయూ ఇన్‌చార్జి వీసీ క్రిష్టారెడ్డి

కడప కల్చరల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): భారతీయ సంస్కృతికి నిలువెత్తునిదర్శనం రామాయణం అని యోగివేమన విశ్వవిద్యాలయం ఇన్‌చార్జ్ వైస్‌చాన్సలర్ ఆచార్య కె.క్రిష్టారెడ్డి అన్నారు. రాముని గుడి అంటూ లేని గ్రామం మన భారతదేశంలో ఉండదన్నారు. వైవీయూ ఆధ్వర్యంలోని సీపీ బ్రౌన్ భాషాపరిశోధన కేంద్రంలో రామాయణం, సామాజిక దృక్పథం అనే అంశంపై జరుగతున్న రెండు రోజుల అంతర్జాతీయ సదస్సులో భాగంగా మంగళవారం ఉదయం ప్రారంభ సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆచార్య క్రిష్టారెడ్డి హాజరై మాట్లాడారు. రామాయణంలోని ప్రతిపాత్ర నాటికి నేటికీ రేపటికి కూడా గొప్ప సందేశాన్ని ఇస్తుందన్నారు.సభకు అధ్యక్షత వహించిన ప్రాచీన విశిష్ట అధ్యయన కేంద్రం సంచాలకులు ఆచార్య ఎం.సంపత్‌కుమార్ మాట్లాడుతూ రామాయణ కావ్యాన్ని ఆధ్యాత్మిక గ్రంథంగా కాకుండా ఆధునిక సమాజానికి ఉపకరించే తీరును సదస్సు ద్వారా తెలియజెప్పాలనే లక్ష్యంతో ఈకార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో బ్రౌన్‌భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య పార్వతి, ఆచార్య మలయవాసిని, స్వామి తురియానంద, భూతపురి గోపాలక్రిష్ణశాస్త్రి, డాక్టర్ చింతకంట శివారెడ్డి, వైవీయూ అధ్యాపకులు ఆచార్య ఎంఎం వినోదిని, రాంప్రసాద్‌రెడ్డి, ఆచార్య ఈశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలి



సర్వేను పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి నాగరాజు

సికెదిన్నె, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రజలు వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి నాగరాజు తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం జె.నారాయణపురంలో మంగళవారం రాష్ట్రీయ బాల ఆరోగ్య కార్యక్రమం కోఆర్డినేటర్ డాక్టర్ రమేష్‌తో కలిసి సంక్రమిత, అసంక్రమిత వ్యాధుల సర్వే 3.0ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో వ్యాధుల బారిన పడటానికి అవకాశం గల వ్యక్తులను గుర్తించడానికి పరీక్షలు జరపాలన్నారు. అనుమానితులను నిపుణులైన వైద్యుల వద్దకు పంపితే నిర్ధారించడం జరుగుతుందన్నారు. పై వ్యాధులను గుర్తించడానికే సర్వే జరుగుతుందని, దేశ వ్యాప్తంగా జరిగే ఈ సర్వేకు ప్రజలు సహకరించాలన్నారు. ఈ సందర్భంగా సర్వేలో లక్ష్యాలు చేరుకోని దాదాపు 17 మంది సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారి రామ వేంద్ర, జనార్ధన్, జయరత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఆంజనేయస్వామికి బంగారు హారం బహూకరణ



ఆంజనేయస్వామికి బంగారు హారం అందజేస్తున్న భక్తులు

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక పాత మార్కెట్‌లోని ఆంజనేయస్వామికి భక్తులు రూ.14 లక్షలు విలువైన 153 గ్రాముల రామ్‌పరివార్ బంగారు హారాన్ని అందజేశారు. వెదుర్ల బజారుకు చెందిన సాయిప్రసాద్ తన సతీమణి అమ్మణ్ణి జ్ఞాపకార్థం స్వామివారికి బంగారు హారం తయారు చేయించారు. మంగళవారం వారి కుమారుడు కిరణ్, కోడలు సత్యలతలు ఆలయ చైర్మన్ సత్యనారాయణ, ఈవో రమణారెడ్డిలకు బంగారు హారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారికి అలంకరించారు. హారాన్ని బహూకరించిన సాయిప్రసాద్ కుటుంబ సభ్యులకు ఆలయ చైర్మన్, ఈవోలు కృతజ్ఞతలు తెలిపారు.

## చోరీయత్నం విఫలం

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : ప్రొద్దుటూరు మండలం దొరసానిపల్లెలో రేణుక ఎల్లమ్మ వీధిలోని ఓ ఇంట్లో మంగళవారం తెల్లవారు జామున దొంగలు చోరి చేయడానికి వెళ్లి విఫలం అయిన ఘటన వెలుగు చూసింది. రూరల్ పోలీసుల వివరాల మేరకు.. రేణుక ఎల్లమ్మ వీధిలో భూమా రాజ అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కుటుంబం నివాసం ఉంటున్నారు. అతను బెంగుళూరులో ఉద్యోగం చేస్తూ అప్పుడప్పుడు ఇంటికి వచ్చి వెళ్లేవారు. మంగళవారం తెల్లవారుజామున రాజా ఇంటి గేటు తాళం పగలగొట్టి ఇంట్లోకి ప్రవేశించిన దొంగలు బీరువాలు తెరిచే ప్రయత్న చేశారు. అవి తెరుచుకోకపోవడంతో దొంగలు తిరిగి వెళ్లిపోయారు. ఉదయాన్నే రాజ ఇంటి తలుపులు తెరిచి ఉండటంతో గమనించిన బంధువులు అతనికి ఫోన్ చేసి విషయం తెలిపారు. దీంతో రాజా బెంగుళూరు నుంచి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ బాలమద్దిలేటి, ఎస్ఐ వెంకట సురేష్‌లు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. దొంగలు ఇంటిలోని బీరువాలు తెరవడానికి ప్రయత్నించి విఫలమైనట్లు గుర్తించారు. పూర్తి స్థాయిలో విచారిస్తున్నారు.

## 22 నుంచి ప్రాజెక్టుల ప్రాంతీయ సదస్సు

- ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.ఈశ్వరయ్య

కడప సెవెన్ రోడ్స్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): కడపలో ఈనెల 22 నుంచి 24 వరకు జరిగే ప్రాజెక్టుల ప్రాంతీయ మహాసభ జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రూ.80వేల కోట్ల అంచనా వ్యయంతో గోదావరి-బనకచర్ల ఎత్తిపోతల పథకం కేవలం కాంట్రాక్టర్ల కడుపునింపి తద్వారా ఎన్నికల నిధి పోగుచేసుకోవడానికి ఉపయోగపడుతుందని ఆరోపించారు. గతలో పోలవరం పూర్తయితే కృష్ణాడెల్టా ఆయకట్టు స్థిరీకరణ ద్వారా శ్రీశైలంలో కృష్ణాడెల్టాకున్న క్యారీ ఓవర్ నీళ్లను రాయలసీమ ప్రాజెక్టుకు వాడుకునే వెలుసుబాటు ఉంటుందని చెబుతూ వచ్చారన్నారు. కానీ నేడు కొత్త ప్రతిపాదనల పేరుతో రాయలసీమ ప్రజలను మభ్యపెడుతున్నారని వాపోయారు. పోలవరం పూర్తయితే పట్టిసీమ ఎత్తిపోతల పథకానికి ప్రాధాన్యత ఉండదని తెలిసినా రూ.1600 కోట్లు ఖర్చు చేశారన్నారు. సీమలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులకు రూ.10 వేల కోట్లు కేటాయిస్తే ప్రాధాన్యత క్రమంలో పంట కాల్వల పూర్తి ద్వారా 10 లక్షల ఎకరాల ఆయకట్టు అభివృద్ధి చెందుతుదన్నారు. సీమపట్ల, ప్రాజెక్టుల పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే కృష్ణానది యాజమాన్య బోర్డును కర్నూలులో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కడపలో జరిగే రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం జిల్లాల ప్రాజెక్టుల ప్రాంతీయ మహాసభకు ఏఐకేఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య, నీటిపారుదల రంగ నిపుణులు టి.లక్ష్మీనారాయణ, బొజ్జ దశరథరామిరెడ్డి, డాక్టర్ ఎస్.తులసిరెడ్డి, 100 టీఎంసీ రామాంజనేయులు, ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ తదితరులు పాల్గొంటారన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకటశివ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రాంగణ ఎంపికల్లో కేఎస్ఆర్ఎం విద్యార్థుల మెగా విజయం



ప్రాంగణ ఎంపికల్లో ఎంపికైన విద్యార్థులతో కేఎస్ఆర్ఎం కళాశాల ఎండీ చంద్ర ఓబుళరెడ్డి (నాని) తదితరులు

సికెదిన్నె, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రాంగణ ఎంపికల్లో కేఎస్ఆర్ఎం కళాశాల విద్యార్థులు మెగా విజయాన్ని సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ వీఎస్ఎస్ మూర్తి తెలిపారు. స్థానిక కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం మెయిల్ కంపెనీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో 80 మంది విద్యార్థులు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాంగణ ఎంపికల్లో 52 మంది సివిల్ విద్యార్థులు, 13 మంది మెకానికల్ విద్యార్థులు, 15 మంది ఈఈఈ విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించి ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. వీరికి ట్రైనింగ్ కాలంలో 2.3 లక్షలు వార్షిక వేతనం అందిస్తారని, ట్రైనింగ్ పూర్తయినవారికి రూ.5లక్షలు వేతనం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా కళాశాల కళాశాల ఎండీ చంద్ర ఓబుళరెడ్డి (నాని) మాట్లాడుతూ మెయిల్ కంపెనీ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో తమ విద్యార్థులు వృత్తినైపుణ్యాన్ని ప్రదర్శించి విజయం సాధించినందుకు అభినందించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ రాజేశ్వరమ్మ, వైస్‌చైర్మన్ మదనమోహన్‌రెడ్డి, వైస్‌ప్రిన్సిపల్ ప్రసాద్, వివిధ విభాగాల అధిపతులు విద్యార్థులను అభినందించారు.

# చేయూతతోనే.. చేతి వృత్తుల మనుగడ

- చెక్క దువ్వెనల తయారీలో శెట్టిగుంట మహిళలు
- ముడి సరుకు సేకరణలో ఇబ్బందులు
- అమ్ముకోవాలంటే తమిళనాడు వెళ్లాల్సిందే..
- ఆధునిక పరికరాలు, రుణాలు ఇప్పించాలి





దువ్వెనలు తయారుచేస్తున్న మహిళలు (ఇన్‌సర్ట్) విక్రయానికి సిద్ధంగా ఉన్న దువ్వెనలు

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు తల దువ్వుకునేందుకు చెక్క దువ్వెనలను ఉపయోగించేవారు. తమిళనాడు ప్రాంతంలో ఇప్పటికీ వాటిని వినియోగిస్తుంటారు. ఆ ప్రాంతంలో కొన్ని శుభకార్యాలు చేసేటప్పుడు తీసుకెళ్లే సారెలో చెక్క దువ్వెనలు తప్పనిసరిగా ఉండాల్సిందే. అంతటి ప్రాముఖ్యం ఉన్న చెక్క దువ్వెనలను మన రాష్ట్రంలో మాత్రం వినియోగించేవారు ప్రస్తుతం అరుదనే చెప్పాలి. అయితే, అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గంలో ఇప్పటికీ కొన్ని కుటుంబాలు చెక్క దువ్వెనల తయారీనే జీవనాధారంగా బతుకు వెళ్లదీస్తున్నాయి.

రైల్వేకోడూరు మండలంలోని శెట్టిగుంట గ్రామంలో పది కుటుంబాలు చెక్క దువ్వెనలు తయారు చేస్తుంటాయి. ముఖ్యంగా మహిళలే వీటిని తయారు చేస్తారు. ఒక్కో మహిళ రోజుకు 100 దాకా చెక్కదువ్వెనలు, ఈరబాని అయితే 75 దాకా తయారు చేస్తారు. వీటిని మన రాష్ట్రంలోని తిరుపతి తోపాటు, తమిళనాడు రాష్ట్రంలో ఈరబాని సుమారు రూ.5కు , చెక్క దువ్వెన సుమారు రూ.3లకు విక్రయిస్తుంటారు.

**ఇవీ సమస్యలు..**

నక్కిని, అల్లి రకం కొయ్యతో చెక్కదువ్వెనలు తయారు చేస్తుంటారు. ఈ కొయ్యను సమీపంలో అటవీ ప్రాంతంలో సేకరించుకుని తెచ్చుకునేవారు. ప్రస్తుతం ముడి సరుకు సేకరణకు అడవిలోకి వెళ్లేందుకు అటవీశాఖ వారు అనుమతించడంలేదని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం దువ్వెనల తయారీకి రంపాలు వినియో గిస్తున్నామని, ఆధునిక పరికరాలు అందజేస్తే పని మరింత సులభంగా ఉంటుందని అంటున్నారు. ఇంత కష్టపడి తయారు చేసినా తమిళనాడు రాష్ట్రంలో సాంగ్యాలు ఎక్కువగా ఉంటే మాత్రం కొంత మేరకు ధర ఉంటుందని చెబుతున్నారు. గిట్టుబాటు ధర లేని సమయంలో జీవనోపాధికి ఇబ్బందిగా ఉంటుందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు శాశ్వత ఉపాధి కల్పించడంలో భాగంగా ప్రభుత్వం ఆధునిక యంత్రాలు, పనిముట్లు, రుణాలు, పక్కాగృహాలు ఇచ్చి ప్రోత్సహించాలని మహిళలు కోరుతున్నారు. తరతరాలుగా పూరి గుడిసెల్లోనే జీవిస్తున్నామని, ప్రభుత్వం పక్కాగృహాలు మంజూరు చేయాలని కోరుతున్నారు.

### రెక్కాడితేనే..



గిరాకీ ఉన్నప్పుడు పర్వాలేదు. లేనప్పుడు ఇబ్బందిగానే ఉంటుంది. నాయకులకు ఎన్నో సార్లు విన్నవించుకున్నాం. ఒక్క నాయకుడు ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లినా మా సమస్యలు పరిష్కారమయ్యేవి.

- సాలాపక్షి సుందరమ్మ

### రుణాలు అందించాలి



రుణాలు మంజూరు చేయాలని ఎన్నో ఏళ్లుగా కోరుతున్నాం. ప్రస్తుతం పాత పనిముట్లనే వినియోగిస్తున్నాం. తమ కష్టాలు గుర్తించి ప్రభుత్వం రుణాలిచ్చి ప్రోత్సహిస్తే వాటితో ఆర్థికంగా స్వాలంబన సాధిస్తాం.

- సాలాపక్షి వెంకటమునెమ్మ

### ముడిసరుకు కోసం తిప్పలు



అటవీ శాఖ నిబంధనల కారణంగా అడవికి వెళ్లి కొయ్య తీసుకు రావడం ఇబ్బందిగా మారింది. ప్రభుత్వం. నెలకు సరిపడా ముడిసరుకు ఇచ్చి, రుణాలు మంజూరు చేస్తే, దువ్వెనల తయారీ ఇంకా జోరుగా సాగుతుంది.

- ఎంబిరి ఆదిలక్షుమ్మ

# పూర్వ ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలి



చిట్వేలి మావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో నిర్మలాజ్యోతి



ఓబులవారిపల్లి: అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇస్తున్న అధికారులు

రామాపురం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకొని చిన్నపిల్లలకు పునాది అభ్యసనం మెరుగుపర్చాలని అంగన్వాడీ వర్కర్లకు డిప్యూటీ డీఈవో శివప్రకాశ్‌రెడ్డి, లక్కిరెడ్డిపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆఫీసర్ పద్మావతి సూచించారు. మండలంలోని నీలకంఠ్రావుపేట జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సోమవారం జ్ఞానజ్యోతి 120 శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. మొదటి రోజున డిప్యూటీ సీఈవో హాజరై మాట్లాడుతూ . పిల్లల పునాది అభ్యసనం మెరుగుపర్చడానికి, వారి సమగ్రాభివృద్ధికి ఈ శిక్షణ తరగతులు వినియోగించుకోవాలన్నారు. వారి వెంట మండల విద్యాశాఖ అధికారి రామకృష్ణుడు, డీఆర్పీలుగా కుమార్‌స్వామి, వెంకటసుబ్బయ్య, పార్థసారథి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సుజాతరెడ్డి, హుస్సేనమ్మ, అంగన్వాడీ కార్యకర్త పాల్గొన్నారు.

**పెనగలూరు:** అంగన్వాడీ కార్యకర్తలు క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని ఐసీడీఎస్ చిట్వేలి ప్రాజెక్టు సీడీపీవో నిర్మలాజ్యోతి అన్నారు. మంగళవారం పెనగలూరు ఉన్నత పాఠశాలలో పెనగలూరు సెక్టారు పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలకు 120 రోజుల శిక్షణ కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. కోర్స్ డైరెక్టర్ ఎంఈవో-1 గిరివరదయ్య అధ్యక్షతన పెనగలూరు సెక్టార్ అంగన్వాడీ కార్యకర్తలకు 6 రోజుల స్టాల్స్ శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సమావేశంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌లు విజయకుమారి, విశాలాక్షి, ఆర్పీలు, ఎమ్మార్పీలు తదితరులు పాల్గొన్నారు.

**చిట్వేలి:** జ్ఞానజ్యోతి 120 రోజుల సర్టిఫికెట్ కోర్సులో భాగంగా 18వ తేదీ మంగళవారం అంగన్వాడీ వర్కర్స్‌కు స్థానిక ఉన్నత పాఠశాలలో ఆరు రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో నిర్మలాజ్యోతి, సూపర్‌వైజర్‌లు వసుంధరమ్మ, సురేఖ, రాణి, రాజేశ్వరి, ఎంపీడీవో కోదండనాయుడు, ప్రధానోపాధ్యాయులు ఏబీఎస్ ప్రసాద్, కె.వెంకటేశ్వర్లు, డీఆర్పీలు ఓబుల్‌రెడ్డి, సురేంద్ర, శ్రీహరి, అంగన్వాడీ వర్కర్‌లు తదితరులు పాల్గొన్నారు.

**ఓబులవారిపల్లె:** అంగన్వాడీ కార్యకర్తలకు 120 రోజుల సర్టిఫికెట్ కోర్సులో భాగంగా మూడో రోజు జ్ఞానజ్యోతి పేరున శిక్షణ కార్యక్రమం ముక్కావారిపల్లె హైస్కూల్లో ఇవ్వడం జరిగిందని కోర్సు కోఆర్డినేటర్ రెడ్డయ్య తెలిపారు. ఈ సందర్భంగా శిక్షణ కార్యక్రమంలో భాగంగా సృజనాత్మక అభివృద్ధి, సామాజిక అభివృద్ధి, శారీరక భాషాభివృద్ధి, భాష, బేధ, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇవ్వడం జరిగింది. ఇక్కడ నేర్చుకున్న అంశాలను కేంద్రాల్లో పిల్లలకు నేర్పాలని కోర్సు కోఆర్డినేటర్ రెడ్డయ్య పాల్గొని వివరించారు. అలాగే సీడీపీవో సౌభాగ్యమ్మ, ఏసీడీపీవో సరళాదేవి, సూపర్‌వైజర్‌లు అనసూయ, నిర్మల, గుణవతి, హైస్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఈ క్రాప్ నమోదు తప్పనిసరి


సిద్దవటం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : రబీ సీజన్‌లో సాగు చేసిన పైర్లను తప్పనిసరిగా ఈ క్రాప్‌లో నమోదు చేయించాలని వ్యవసాయాధికారి రమేష్‌రెడ్డి తెలిపారు. సిద్దవటం మండలం మాచుపల్లె గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశానికి బద్వేల్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు నాగరాజు, మండల వ్యవసాయాధికారి కె.రమేష్‌రెడ్డి, మాచుపల్లె రైతు సేవా కేంద్రం వ్యవసాయ సహాయకులు టి.లక్ష్మీదేవి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏవో మహేష్‌రెడ్డి మాట్లాడుతూ పొలం పిలుస్తోంది కార్యక్రమం ప్రతి మంగళవారం, బుధవారాల్లో నిర్వహిస్తారని రైతులు అత్యధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ప్రస్తుత రబీ సీజన్‌లో సాగుచేసిన అన్నిరకాల పంటలను ఈక్రాప్‌లో నమోదు చేయించుకోవడంతోపాటు, ఈకేవైసీ ప్రక్రియను కూడా పూర్తి చేయాలన్నారు. రైతులందరూ 11 అంకెల రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరిగా పొందాలన్నారు. దీనికి గాను ఆధార్‌కార్డు, ఆధార్‌తో లింకు కలిగిన మొబైల్ నంబరు, పట్టాదారు పాసుపుస్తకంతో రైతుసేవా కేంద్రంలో సంప్రదించాలని వివరించారు.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు, పథకాలు, ప్రయోజనాలు పొందడానికి ఇది చాలా అవసరమన్నారు. అనంతరం టక్కోలిలో పంటల మోడళ్లను పరిశీలించి రైతు బి.భాగ్యలక్ష్మీని అభినందించారు.

## రామాయణం మానవాళికి మార్గదర్శకం

నందలూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : రామాయణం మానవాళి మనుగడకు మార్గదర్శకమని ఒంటిమిట్ట శ్రీ పోతన సాహిత్యపీఠం అధ్యక్షుడు, రాజంపేట స్పెషల్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ డాక్టర్ పసుపులేటి శంకర్ అన్నారు. భారత ప్రభుత్వ ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం, యోగివేమన విశ్వవిద్యాలయం, చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ బాషా పరిశోధన కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం కడపలోని బ్రౌన్, శాస్త్రి సమావేశమందిరంలో నిర్వహించిన తెలుగులో రామాయణాలు, సా మాజిక దృక్పథం అనే కార్యక్రమాన్ని ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారం భించారు. అనంతరం సమావేశంలో రామాయణం, జాతికి సందేశం అంశంపై పలువురు ఉపన్యసించారు. ఈ కార్యక్రమంలో ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం సంచాలకులు ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్, యోగివేమన విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కృష్ణారెడ్డి, ఆంధ్రా విశ్వవిద్యాలయ తెలుగుశాఖ అధ్యక్షుడు ఆచార్య మలయవాసిని, చిన్మయా మిషన్ కడప జిల్లా అధ్యక్షులు తురియా నందస్వామి, కడప రామకృష్ణ మిషన్ కార్యదర్శి అనుపమానందస్వామి, బ్రౌన్ గ్రంథాలయ సంచాలకులు ఆచార్య పార్వతి, శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం ఆచార్యులు శ్రీనివాసులురెడ్డి, ఆచార్య ఈశ్వర్‌రెడ్డి, అవధాని లోక జగన్నాథశాస్త్రి, మధుబాబు, భూపతి, రాయల్ రామాంజనేయులు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరామ ఎత్తిపోతల పథకానికి నిధులు విడుదల చేయాలి

● కలెక్టర్‌కు సాయిలోకేష్ వినతి



కలెక్టర్ శ్రీధర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న జిల్లా బీజేపీ అధ్యక్షుడు సాయి లోకేష్

రాజంపేట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : ఒంటిమిట్ట చెరువుకు సోమశిల వెనుక జలాల ద్వారా నీరందించే శ్రీరామ ఎత్తిపోతల పథకం సిమెంటు పైపులైన్లు దెబ్బతిన్నందున వాటి స్థానంలో ఇనుప పైపులైన్ల కోసం 11 కోట్ల రూపాయలు మంజూరు చేయాలని కోరుతూ కడప కలెక్టర్ శ్రీధర్‌కు అన్నమయ్య జిల్లా బీజేపీ అధ్యక్షుడు సాయిలోకేష్ వినతిపత్రం సమర్పించారు. మంగళవారం కడపకు వెళ్లి కలెక్టర్‌ను కలిసి శ్రీరామ ఎత్తిపోతల పథకం 13 కిలోమీటర్లు పొడవున వేసిన సిమెంటు పైపులైన్లు దెబ్బతిన్నాయని తెలిపారు. ఒంటిమిట్ట చెరువుకు నీరు అందించి ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ పథకాన్ని ఏర్పాటు చేశారన్నారు. ఇందుకు కలెక్టర్ సానుకూలగా స్పందించినట్లు సాయిలోకేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి కృష్ణయాదవ్, జయకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌ఎస్‌ఐపీ ఫైనల్స్‌కు మండల విద్యార్థినులు

నందలూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): నేషనల్ స్టూడెంట్ ఇన్నోవేషన్ చాలెంజ్ కాంపిటీషన్‌లో తమ పాఠశాల విద్యార్థులు వరుసగా రెండోసారి ఫైనల్స్‌కి సెలెక్టయ్యా రని గొబ్బిళ్ల అక్షర స్కూల్ ఛైర్మన్ గొబ్బిళ్ల త్రినాథ్, కరస్పాండెంట్ శ్రీనాథ్ తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ ఈ ఏడాది ఎన్ఎస్ఐసీ ఫేజ్-2లో విద్యార్థిను లు లక్ష్మీచైతన్య, జైనాబ్ ఫైనల్‌కు చేర్చరని తెలియజేశారు.

## ఏఐటీయూసీ సహాయ కార్యదర్శిగా సికిందర్



రాజంపేట టౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్ర జ్యోతి) : ఏఐటీయూసీ అన్నమయ్య జిల్లా సహాయ కార్యదర్శిగా తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మంగళవారం పట్టణానికి చెందిన సికిందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను విద్యార్థి నాయకుడిగా, ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శిగా అలుపెరగని పోరాటాలు చేశామన్నారు. సీపీఐ రాజంపేట నియోజకవర్గం, పట్టణ కార్యదర్శిగా సేవలందించినట్లు తెలిపారు. ఏఐ టీయూసీ మొదటి మహాసభలో తనను గుర్తించి ఈ అవకాశం ఇచ్చిన ప్రతి ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## టీడీపీ కార్యకర్తకు ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న వర్ల రామయ్య

సుండుపల్లె, ఫిబ్రవరి 18 (ఆంధ్ర జ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న తనకు సాయ చేసి ఆదుకోవాలని మండలంలోని తిమ్మసముద్రం గ్రామ పంచాయతీకి చెం దిన టీడీపీ సీనియర్ నాయకుడు మోహన్ నాయుడు ఇటీవల టీడీపీ కేంద్ర కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు అర్జీ సమర్పించారు. దీంతో టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య పార్టీ తరపున రూ.ఒక లక్ష విజయవాడ టీడీపీ కార్యాలయంలో అందజేసినట్లు టీడీపీ నాయకులు తెలిపారు.

## సదిపిరాళ్లపల్లె వాసికి డాక్టరేట్



శ్రీదేవి

సంబేపల్లె, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలం లోని సదిపిరాళ్లపల్లికి చెందిన ఆదిరెడ్డి కుమార్తె శ్రీదేవికి మేనేజ్‌మెంట్ స్టడీస్‌లో డాక్టరేట్ సాధించింది. రాయలసీమ ప్రాంతంలోని సేంద్రియ ఆహార పదార్థాలను కొనుగోలు చేసే వినియోగదారుల ప్రవర్తనపై ప్రొఫెసర్ కాత్యాయని మార్గదర్శకత్వంలో ఆమె పరిశోధన చేసినట్లు యూనివర్సిటీ డీఎస్ బీ. జీవనజ్యోతి వెల్లడించారు. ఈమె ప్రస్తుతం తిరుపతి ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు ఆమెను అభినందించారు.

## ఎమ్మార్పీఎస్ నేతలపై కేసు నమోదు

రాయచోటి టౌన్, ఫిబ్రవరి 18( ఆంధ్రజ్యోతి) ఎటువంటి అనుమతులు లేకుండా కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారంటూ ఎమ్మార్పీఎస్ నేతలపై మంగళవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు రాయచోటి నియోజవర్గ ఎమ్మార్పీఎస్ కోఆర్డినేటర్ గుంటిమడుగు ఆనంద్‌తో రాయచోటి అర్బన్ సీఐ చంద్రశేఖర్ దురుసుగా ప్రవర్తించాడన్న కారణంగా మంగళవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో గుంటిమడుగు గ్రామస్తులు కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. అనుమతులు లేకుండా ధర్నా చేయరాదని పోలీసులు అడ్డు చెప్పడంతో ఆందోళనకారులు పోలీసులతో దురుసుగా ప్రవర్తించారు. దీంతో గుంటిమడుగు ఆనంద్‌తోపాటు, పది మందిపై కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ చంద్రశేఖర్ తెలిపారు.

## ఐదుగురికి జరిమానా, జైలు

కలకడ, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి):మద్యం తాగి వాహనాలు నడిపిన కేసుల్లో ఐదుగురికి న్యాయస్థానం జరిమానాతో పాటు జైలుశిక్ష విధించినట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. ఈ కేసుల్లో నిందితులైన మహ్మద్, షాదిక్, శ్రీను, కిరణ్‌కుమార్, సురేంద్రలను కోర్టులో హాజరుపరచగా. వారికి వాల్మీకిపురం జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఒక్కొక్కరికి రూ.11 వేలు జరిమానాతో పాటు వారం రోజుల పాటు జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

## తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు



బోరు బండికి పూజలు నిర్వహిస్తున్న మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి

గాలివీడు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు నియోజకవర్గ టీడీపీ నాయకుడు డాక్టర్ లక్ష్మీప్రసాద్ రెడ్డి తెలిపారు. మంగళవారం గాలివీడు మండలం చీమలచెరువుపల్లిలో ఆయన బోరును ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఇప్పటికే నీటి సమస్య పరిష్కరించామన్నారు. రాబోయే మూడు నెలలు తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటా మన్నారు.

## టార్పాలిన్ల పంపిణీ



టార్పాలిన్లు పంపిణీ చేస్తున్న మంత్రి సతీమణి హరిత

చిన్నమండెం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పడమటికోన గ్రామ పంచాయతీ బోరెడ్డిగారిపల్లె సచివాలయం వద్ద వెలుగు పథకం ద్వారా మంజూరైన టార్పాలిన్లను మహిళా రైతు ఉత్పత్తిదారుల సంఘ సభ్యులకు రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సతీమణి హరిత పంపిణీ చేశారు. మండలానికి 102 టార్పాలిన్లు కేటాయించగా అందులో 30 పట్టలు పంపిణీ చేశారు. ఏపీఎం రెడ్డెమ్మ, సీసీలు అంజలి, వెంకటలక్ష్మి, రెడ్డెన్న, నాగరాజు, సుధామణి, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## పరీక్ష సామగ్రి వితరణ



పరీక్షల సామగ్రి అందజేస్తున్న వాసవి సహృదయ సంస్థ సభ్యులు

పెనగలూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కంబాలకుంట బీసీ కాలనీ సమీపంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలోని టెన్త్, ఇంటర్మీడియట్ విద్యార్థులకు వాసవి సహృదయ సేవాసంస్థ రాజంపేట వారి సహకారంతో మంగళవారం పరీక్షల సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఓ సుచరిత ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాసవి సహృదయ సేవాసంస్థ ప్రధాన కార్యదర్శి జగన్, ఆర్థిక కార్యదర్శి యశ్వంత్, ఎస్టీయూ రాష్ట్ర సాంస్కృతిక వ్యవహారాల కన్వీనర్ పి.ఎల్లయ్య, ఏపీఎస్‌టీఎఫ్ కన్వీనర్ అల్లం అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

రాజంపేట: లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు నరసింహరాజు ఆధ్వర్యంలో మండలంలోని బోయనపల్లె అరుంధతివాడ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. మంగళవారం 100 మంది పేద విద్యార్థులకు తాగునీటి బాటిళ్లు, నోటు పుస్తకాలు, విద్యాసామగ్రిని లయన్స్‌క్లబ్ సభ్యుడు డాక్టర్ బాలరాజు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వంద శాతం ఫలితాలు సాధించాలి



వంట గదులను పరిశీలిస్తున్న ఏఎస్‌డబ్ల్యూ శ్రీనివాసమూర్తి

రామాపురం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పదో తరగతి విద్యార్తులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని ఏఎస్ డబ్ల్యూవో శ్రీనివాస మూర్తి సూచించారు. స్థానిక సాంఘిక సం క్షేమ హాస్టల్‌ను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మెనూ అమలు తీరుపై ఆరా తీశారు. వసతులను, రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వార్డెన్ అనుమప, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

## మానవ అక్రమ రవాణాపై అప్రమత్తంగా ఉండాలి

గాలివీడు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మానవ అక్రమ రవాణా, బాలికలపై అఘాయిత్యాలకు పాల్పడే వారిపై అప్రమత్తంగా ఉండాలని మండల విద్యాధికారి శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక వెలుగు కార్యాలయంలో గ్రాస్ రూట్ స్టేక్ హోల్డర్స్ ట్రైనింగ్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలు, మానవ అక్రమ రవాణా, బాలికలపై జరిగే అఘాయిత్యాల గురించి నేటి సమాజంలో జరుగుతున్న అక్రమాలపై సరైన అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఆడపిల్లలని బాగా చదివించి వారి భవిష్యత్తును తీర్చిదిద్దాలని, సరైన వయసులోనే వివాహం చేయాలని తెలిపారు. సురక్ష గ్రామ కార్యక్రమంలో భాగంగా సేఫ్ విలేజ్ ప్రోగ్రాం ఏర్పాటు చేసి గ్రామ రక్షక్, గ్రామ మిత్ర , గ్రామపెద్ద, నోడల్ టీచర్స్‌ను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శివకుమార్, న్యాయవాది కిరణ్‌కుమార్, రీడ్స్ ట్రైనర్ ఎల్లప్ప, శ్రీనివాసులు, వెలుగు సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఏఐటీయూసీ కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవం



అధ్యక్షుడు గంగాధర్, వర్కింగ్ ప్రెసిడెంటు వర్రి సురేష్

రైల్వేకోడూరు రూరల్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): జిల్లా ఏఐటీ యూసీ గౌరవాధ్యక్షుడుగా తు మ్మల రాధాకృష్ణ, అధ్యక్షుడుగా మాదరాజు గంగాధర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పట్టణం లోని పాతబజార్ ఎలిమెంటరీ పాఠశాల వద్ద నిర్వహించిన ఏఐటీ యూసీ జిల్లా ప్రథమ మహాసభల్లో మంగళవారం ఏఐటీయూసీ కార్య వర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా వర్కింగ్ అధ్యక్షుడుగా మదనపల్లికి చెందిన వర్రి సురేష్ కుమార్, ఉపాధ్యక్షుడుగా గాలి చంద్ర (రాజంపేట), పోకూరి మురళి(ఏపీఎండీసీ), నర్సింహులు (పీలేరు), ప్రధాన కార్యదర్శిగా మదన పల్లికి చెందిన ఎం.సాంబశివ. ఉప ప్రధాన కార్యదర్శులుగా సలీం బాషా (బి.కొత్తకోట) సహాయ కార్యదర్శిగా సికిందర్(రాజంపేట), వేణుగోపాల్ రెడ్డి (బి.కొత్తకోట), కృష్ణ చైతన్య (రైల్వేకోడూరు). జిల్లాకోశాధికారిగా సరోజమ్మ(పుల్లంపేట) ఎన్నుకున్నారు.

## రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ రుణాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో రెడ్డెయ్య తెలిపారు. బీసీ కార్పొరేషన్ రుణాలకు కోసం ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకున్న వారికి మంగళవారం స్థానిక ఎంపీడీవో సభాభవనంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు.395 మంది దరఖాస్తు చేసుకోగా, మొదటి రోజు 142 మంది హాజరయ్యారని ఆయన తెలిపారు.

**రామాపురం:** మండలంలో 400 మంది ఇంటర్వ్యూలకు హాజరైనట్లు ఎంపీడీవో జాషువా తెలిపారు. మండలంలో 10 యూనిట్లు కాపులకు 30 యూనిట్లు కేటాయించినట్లు తెలిపారు.

**సుండుపల్లె :** స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, బ్యాంకు మేనేజర్ల ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండలానికి బీసీ కార్పొరేషన్ ద్వారా 40, కాపు కార్పొరేషన్ నుంచి 11, ఈడబ్ల్యూసీ ఒక యూనిట్ మంజూరైనట్లు వారు తెలిపారు.

నందలూరు: మండలానికి 54 యూనిట్లు కేటాయించగా 379 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారని అధికారులు తెలిపారు.

**చిట్వేలిలో నేడు ఇంటర్వ్యూలు**

**చిట్వేలి :** స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఉదయం 10.30 గంటలకుఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మోహన్ తెలిపారు.

పెనగలూరు: వివిధ కార్పొరేషన్లు మంజూరు చేసే రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారు బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని ఎంపీడీవో ఎస్.విజయరావు మంగళవారం తెలిపారు. దరఖాస్తు ఫారం కాపీతో పాటు, ఆధార్‌కార్డు తీసుకుని ఇంటర్వ్యూకు రావాలని ఆయన అభ్యర్థులను కోరారు.

# నీలం మామిడిలో.. కానరాని పూత



సింగనమల వద్ద పూత రాని నీలం రకం మామిడి తోట

- పూత కోసం ముమ్మరంగా క్రిమిసంహారక మందులు పిచికారీ
- ఆందోళనలో రైతులు

పెనగలూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రతికూల వాతావరణ పరిస్థితుల వల్ల ఈ యేడు మామిడి తోటల్లో ఆలస్యంగా పూత వస్తోంది. ఈ పాటికి బేనీషా, అంటిమామిడి, పోలూరు, ఖాదర్, మలుగుబ, ఇమామ్ పసంద్, ఢిల్లీ పసంద్, లడ్డూ పసంద్, గద్దమామిడి తదితర రకాల మామిడి చెట్లలో పూత బాగా వచ్చింది. అయితే నీలం రకం మామిడి చెట్లలో ఇంకా పూత రాలేదు. పూతకోసం రైతులు శరవేగంగా క్రిమిసంహారక మందులు పిచికారీ చేస్తున్నారు. సాధారణ వాతావరణ పరిస్థితుల్లో అన్నిరకాల మామిడి చెట్లలో ఈ సమయానికి పిందెలు కనిపించాల్సి ఉండగా ప్రతికూల వాతావరణ పరిస్థితుల వల్ల ఈ యేడాది అన్నిచోట్ల ఆలస్యంగా పూత వచ్చింది. అయితే నీలం చెట్లలో మాత్రం ఇంకా పూత రాలేదు. పూత కోసం రైతులు వ్యవసాయ మందులు, షాపుల వరకు పరుగులు తీస్తూ డీలర్లు చెప్పిన మందులను పిచికారీ చేస్తున్నారు. ఒకదఫా అయిపోయి రెండో దఫా కూడా మందులను పిచికారీ చేస్తున్నారు. ఇదిలా ఉండగా మామిడి తోటల్లో ఫలరాజుగా గుర్తింపు కలిగిన బేనీషా పండ్లు తర్వాత అంతటి ఆదరణ కలిగిన కాయలు నీలం రకానికి చెందినవే. పలురకాల కాయలన్నీ జూన్ మాసానికంతటికి సీజన్ ముగిసిపోగా అప్పటికే కోతకు సిద్ధంగా ఉన్న నీలం మామిడికాయలు అంత త్వరగా చెడిపోవు. కాయలు పక్వానికి వచ్చినా ఒకటిన్నర నెలదాకా చెట్లపైన మాగకుండా అలాగే ఉండిపోతాయి. అందువల్ల మామిడి తోటలు సాగుచేసిన రైతులు 80 శాతం తోటలు, చెట్లు నీలం రకానికి చెందినవే ఉంటాయి. రైతులకు, వ్యాపారులకు మంచి లాభాలు తెచ్చి పెట్టే రకం కూడా నీలం కాయలే. నీలం కాయల కోత సీజన్ ప్రారంభమైనప్పటి నుంచి ముగింపు దాకా దాదాపు రెండు నెలల కూలీలకు చేతినిండా పని ఉంటుంది. ఈ సమయంలోనే కమీషన్ ఏజెంట్లు, వ్యాపారులు కూడా బాగా లాభాలు ఆర్జిస్తూ ఉంటారు. ఇతర రాష్ట్రాలు, దేశాలకు కూడా నీలంకాయలు బాగా ఎగుమతి అవుతూ ఉంటాయి. నీలం మామిడి పండు తినడానికి అన్నిరకాల మామిడి పండ్ల కంటే చాలా మధురంగా ఉంటుంది. పేద ప్రజలు కొనుగోలుకు కూడా నీలం, మామిడికాయల ధరలు అనుకూలంగా ఉంటాయి. అందువల్ల అన్నిరకాల ప్రజలు నీలం మామిడికాయలను తినేందుకు బాగా ఇష్టపడతారు. అయితే ఈ యేడు ప్రతికూల వాతావరణం పరిస్థితుల వల్ల ముందుగా పూత రావాల్సిన మామిడి చెట్లే ఆలస్యంగా వస్తున్నది. నీలం రకం మామిడి చెట్లు కూడా ఆలస్యమైనా సరే పూత వచ్చి బాగా కాయలు కాస్తాయని రైతులు ఆశతో ఎదురు చూస్తున్నారు.

### పూత కోసం నీళ్లు కడుతున్నాం



నీలం చెట్లలో కూడా ఈ పాటికి పూత బాగా రావాల్సి ఉంది. చెట్లకు నీళ్లు కడితే వెంటనే పూత వస్తుందని నీళ్లు కడుతున్నాం. డిసెంబరు నెలాఖరు వరకు వర్షాలు బాగా కురిసి నేలలన్నీ పదునులోనే ఉన్నాయి. తోటలకు నీళ్లు కట్టినా కట్టకపోయినా ఆలస్యంగానైనా పూత వస్తుందన్న నమ్మకం ఉంది. ఈ యేడు ఎప్పుడు పూతకు రాని సంకరజాతి చెట్లు కూడా పూత వస్తున్నాయి. దాన్ని బట్టి నీలం చెట్లను అనుమానించాల్సిన అవసరం లేదు.

- కాలి వెంకటేశు, రైతు, కంబాలకుంట బీసీ కాలనీ, పెనగలూరు



తూర్పుపల్లెలో క్రిమిసంహారక మందులు పిచికారీ చేస్తున్న దృశ్యం

### నీలంలో కచ్చితంగా పూత వస్తుంది



సాధారణంగా ఎప్పుడైనా నీలం మామిడిలో పూత ఆలస్యంగానే వస్తుంది. ఈ యేడు అన్నిరకాల మామిడిలో పూత ఆలస్యంగా వచ్చింది. రైతులు చింతించాల్సిన అవసరం లేదు. నీలం మామిడి చెట్లలో కూడా ఈ పాటికి సన్నని మొగ్గ ఏర్పడుతోంది. ఇంకో పదిరోజులు దాటిన తర్వాత మొగ్గ బాగా కనిపిస్తుంది. ఇప్పటి వాతావరణానికి అనుగుణంగా రైతులు సస్య రక్షణ చర్యలు చేపట్టాల్సి ఉంటుంది.

- సురేష్‌బాబు, ఉద్యానశాఖ అధికారి

## భూకబ్జాలను అరికట్టండి

- కడప ఆర్డీవోను ఆదేశించిన జేసీ అదితిసింగ్



భూకబ్జాలను అరికట్టాలని ఆర్డీవోను ఆదేశిస్తున్న జేసీ

సిద్దవటం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పరపల్లె మాధవరం-1 గ్రామ పంచాయతీల్లో భూ కబ్జాలను అరికట్టాలని కడప ఆర్డీవో జాన్‌ఇర్విన్‌ను జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ ఆదేశించారు. సిద్దవటం తహసీల్దారు కార్యాలయంలో మంగళవారం రెవెన్యూ సదస్సులపై జేసీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గురు, శుక్రవారం జిల్లాలోని రెండు మండలాలు తనిఖీ చేసి సిబ్బంది పనితీరు పర్యవేక్షిస్తున్నామన్నారు. సిద్దవటం తహసీల్దారు కార్యాలయంలో రెవెన్యూ సదస్సులు, రీసర్వే ఫిర్యాదుల పరిష్కారం, సిబ్బంది పనితీరుపై ఆరా తీశామన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దవటం ఇన్‌చార్జి తహసీల్దారు మాధవీలత, ఆర్ఐ ప్రసాద్, వీఆర్వోలు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

## విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా సెక్రటరీగా శంకర్



సన్మానం అందుకుంటున్న జిల్లా విశ్రాంత ఉద్యోగ సంఘం నాయకులు

వాల్మీకిపురం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): జిల్లా విశ్రాంత ఉద్యోగుల సంఘం జనరల్ సెక్రటరీగా వలిగిరి శంకర్ నియమితులయ్యారు. నూతన కార్యవర్గం ఎన్నికైన సందర్భంగా మంగళ వారం విజయవాడలోని రెవెన్యూ భవన్‌లో జిల్లా అధ్యక్షుడు రాజగోపాల్‌రెడ్డితో కలిసి ఆయన రాష్ట్ర అధ్యక్షుడు పీఎస్ఎస్ఎన్ శాస్త్రి చేతుల మీదుగా సన్మానం, సత్కారాలు అందుకున్నారు. ఈ సందర్భంగా వలిగిరి శంకర్ మాట్లాడుతూ రాష్ట్ర కార్యవర్గం తనపై ఉన్న నమ్మకంతో ఇచ్చిన పదవికి న్యాయం చేస్తానని, విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన జిల్లా అధ్యక్షుడు, సంఘ నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ముగ్గురికి తీవ్రగాయాలు

రామాపురం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): కర్నూలు- చిత్తూరు 40వ జాతీయ రహదారిలోని రామాపురం మండలం బండపల్లి పంచాయతీ జగనన్న కాలనీ సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండు స్కూటర్లు ఢీకొని వెంకటసుబ్బరాయుడు, బండి వెంకటసుబ్బరాయుడు, శ్రీనివాసులకు తీవ్ర గాయాలైనట్లు ఎస్ఐ వెంకటసుధాకర్‌రెడ్డి తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని ఓబుల్‌రెడ్డిగారిపల్లెకు చెందిన పై ముగ్గురు కూలి పనికోసం జగనన్న కాలనీకి స్కూటర్‌లో వెళ్తుండగా.. మార్గమధ్యంలో బండపల్లి పంచాయతీలోని జగనన్న కాలనీ సమీపానికి రాగానే కడప వైపు నుంచి రాయచోటి వైపు బైకులో వెళ్తున్న కడపకు చెందిన మౌలా వెనుక వైపు నుంచి ఢీకొన్నాడు. ఈ సంఘటనలో ముందు వెళ్తున్న ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. సంఘటన స్థలానికి పోలీసులు చేసుకొని గాయపడిన వారికి ప్రథమ చికిత్స కోసం రాయచోటి ఆసుపత్రికి 108 ద్వారా తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటసుధాకర్‌రెడ్డి తెలిపారు.

## తిరుపతి నుంచి గల్ఫ్‌కు విమాన సర్వీసులు ప్రారంభించాలి

- కేంద్ర మంత్రికి కుడా చైర్మన్ ముక్కా వినతి



కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడుకు వినతిపత్రం ఇస్తున్న ముక్కా

రైల్వేకోడూరు రూరల్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): తిరుపతి నుంచి గల్ఫ్‌కు విమాన సర్వీసులు ప్రారంభించాలని కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడుకు కడప అర్బన్ డెవలప్‌మెంటు అథారిటీ చైర్మన్, కోడూరు టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి వినతిపత్రం అందజేశారు. మంగళవారం విజయవాడలోని కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు నివాసంలో ఆయనను, రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అటు రైల్వే కోడూరు నియోజకవర్గం ఉమ్మడి జిల్లాలో ఎక్కువ మంది గల్ఫ్ దేశాలకు వెళ్లి జీవనం సాగిస్తున్నారని తెలిపారు. గల్ఫ్ నుంచి స్వదేశానికి చెన్నై విమానాశ్రయం నుంచి వస్తూ చాలా మంది ప్రమాదాలు జరిగి మరణిస్తున్నారని, తిరుపతి విమానాశ్రయం నుంచి గల్ఫ్‌కు సర్వీసులు ప్రారంభిస్తే జిల్లా ప్రజలకు అనువుగా ఉంటుందని తెలిపారు. కాగా త్వరలోనే గల్ఫ్‌కు విమాన సర్వీసులు ప్రారంభిస్తామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు.

## అంగన్వాడీలకు శిక్షణ కార్యక్రమం



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈవో సుబ్రమణ్యం

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో అంగన్వాడీలకు 120 రోజుల సర్టిఫికెట్ కోర్స్ శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి డీఈఓ సుబ్రమణ్యం, ఉపవిద్యాశాఖ అధికారి శివప్రకాశ్‌రెడ్డి, కోర్స్ కోఆర్డినేటర్, ఎంఈఓలు బాలాజీనాయక్, వెంకటశివారెడ్డి, ఐసీడీఎస్ పీడీ రమాదేవి, డీఆర్పీలు హాజరయ్యారు. ఈ శిక్షణను ఉద్దేశించి డీఈఓ మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రాథమిక దశలో అభ్యసన సామర్థ్యాలను పెంపొందింపచేస్తే ఉన్నత దశలలో సంపూర్ణ అభివృద్ధి జరుగుతుందని తెలియజేశారు. అనంతరం ఉప విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ జ్ఞానజ్యోతి కార్యక్రమం ఆవశ్యకతను తెలియజేశారు. అనంతరం కోర్సు కోఆర్డినేటర్, ఎంఈఓ మాట్లాడుతూ ప్రాథమిక దశలో విద్యార్థుల హాజరుశాతాన్ని పెంపొందించాలన్నా, విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు మెరుగుపర్చాలన్నా పునాది అభ్యసనం అంగన్వాడీ కార్యకర్తలుగా మీకు మీరేసాటి అంటూ కార్యక్రమం సారాంశాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్పీలు రాజారమేశ్, వెంకటసుబ్బయ్య, సికిందర్, నాగమణి, సుగుణ, శివజ్యోతి, ఎఫ్ఎల్ఎన్ కోఆర్డినేటర్ రాజశేఖర్, సీఆర్పీలు అరుణ్ బాబు, రవిప్రకాశ్ పాల్గొన్నారు.

## రూ.5.51 లక్షలకు తలనీలాల వేలం

సిద్దవటం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): నిత్యపూజస్వామికి భక్తులు సమర్పించుకునే తలనీలాలు సేకరించుకునే హక్కులను అద్దంకి గ్రామానికి చెందిన మహేంద్ర రూ.5.51 లక్షలకు దక్కించుకున్నారని ఆలయ ఈవో మోహన్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని రంగనాయకస్వామి ఆలయంలో మంగళవారం దేవదాయ, ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో ఇందుకు సంబంధించి వేలంపాటను నిర్వహించారు. గతేడాది ఈ హక్కుల ద్వారా రూ.5.85 లక్షలు ఆదాయం రాగా ఈ ఏడాది రూ.34 వేలు తగ్గింది. ఈ కార్యక్రమంలో రాజంపేట దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శివయ్య, ఆలయ కమిటీ చైర్మన్, సిబ్బంది చంద్ర, వంతాటిపల్లె గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



వేలం నిర్వహిస్తున్న ఎండోమెంట్ అధికారులు

## 'మిషన్ వాత్సల్య'ను కట్టుదిట్టంగా అమలు చేయాలి

- కలెక్టర్ చామకూరి శ్రీధర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

రాయచోటి(కలెక్టరేట్), ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మిషన్ వాత్సల్య కార్యక్రమాన్ని పిల్లల సంక్షేమమే ధ్యేయంగా కట్టుదిట్టంగా అమలు చేయాలని, జిల్లాలో బాల్యవివాహాలను రూపుమాపాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ అధ్యక్షతన, మిషన్ వాత్సల్య కార్యక్రమంపై జిల్లా స్థాయి బాలల సంక్షేమం, పరిరక్షణ కమిటీ సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా స్త్రీ, శిశు సంక్షేమశాఖ అధికారి రమాదేవి ఈ సమావేశాన్ని ప్రారంభిస్తూ మిషన్ వాత్సల్య కార్యక్రమంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు జిల్లాలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి శిశు సంక్షేమం, పరిరక్షణ కమిటీని ఏర్పాటు చేసుకున్నామన్నారు. అలాగే గ్రామ, వార్డు స్థాయిల్లో సర్పంచ్ అధ్యక్షతన పోలీస్, రెవెన్యూ తదితర శాఖల అధికారులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసుకున్నామన్నారు. ఈ సమావేశంలో రాజంపేట అడిషనల్ ఎస్పీ మనోజ్ రామనాథ్‌హెగ్డే, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమశాఖ అధికారి రమాదేవి, రాయచోటి మున్సిపల్ కమిషనర్ వాసు, మదనపల్లె, బి.కొత్తకోట మున్సిపల్ కమిషనర్లు, జీఎస్‌డబ్ల్యుఎస్, విద్య, వైద్య సాంఘిక సంక్షేమ, వెనుకబడిన తరగతుల శాఖ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## భర్త వేధింపుల నుంచి రక్షణ కల్పించండి

- ఎస్పీకి ఫిర్యాదు చేసిన మదనపల్లె మహిళ



ఎస్పీకి ఫిర్యాదు చేసిన అనంతరం మీడియాతో మాట్లాడుతున్న బాధితురాలు పార్వతమ్మ

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): 'నా భర్త నాకు కాలయముడిగా తయారయ్యాడని, అతని వేధింపుల నుంచి నాకు రక్షణ కల్పించాలంటూ' జిల్లా పరిధిలోని మదనపల్లె పట్టణం పెంచిపాడులో నివాసముంటున్న పి.భాస్కర్ భార్య పి.పార్వతమ్మ సోమవారం ఎస్పీ విద్యాసాగర్‌నాయుడుకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు వివరాల్లోకి వెళితే.. మదనపల్లె పట్టణం పెంచిపాడుకు చెందిన భాస్కర్‌తో 23 సంవత్సరాల క్రితం పార్వతమ్మకు వివాహమైంది. అప్పటి నుంచి అన్యోన్యంగా ఉన్న భార్యభర్తల మధ్య గత ఆరేళ్లుగా గొడవలు మొదలయ్యాయి. పార్వతమ్మ భర్త భాస్కర్ మదనపల్లె పట్టణంలోని ఎస్టేట్‌లో ఉన్న గార్మెంట్‌లో మేనేజర్‌గా పని చేస్తూ అక్కడే పనిచేస్తున్న ఓ మహిళతో అక్రమ సంబంధం పెట్టుకుని ప్రతిరోజు పార్వతమ్మను చిత్రహింసలకు గురిచేస్తుండేవాడని తెలిపింది. ఈ నేపథ్యంలోనే తనపై పలుమార్లు దాడి చేసి బెల్టుతో, చెప్పులతో కొడుతూ చంపేందుకు ప్రయత్నం చేస్తూ తనను ఇంటి నుంచి పుట్టింటికి తరిమేశాడని ఫిర్యాదులో వివరించారు. తనకు ఇద్దరు పిల్లలు ఉన్నారని, తమ కుటుంబ బాగోగులు చూడకుండా తన భర్త భాస్కర్ తనను వేధింపులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అదనపు కట్నం మరో రూ.10 లక్షలు తీసుకురావాలని చిత్రహింసలకు గురిచేస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. తన భర్తతో పాటు అతనితో వివాహేతర సంబంధం పెట్టుకున్న మహిళతో తనకు ప్రాణహాని ఉందని, వారి బారి నుంచి రక్షణ కల్పించాలంటూ పార్వతమ్మ ఎస్పీకి ఇచ్చిన ఫిర్యాదులో విజ్ఞప్తి చేశారు. బాధితురాలు వెంట ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తోపు కృష్ణప్ప, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి మండెం సుధీర్‌కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు మల్లికార్జున, శ్రీరాములు, రామప్ప, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

- మాజీ సీఎం నల్లారి కిరణ్‌కు వినతి



కిరణ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న వాల్మీకి సంఘం నాయకులు

వాల్మీకి పురం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరుతూ వాల్మీకి సంఘం నాయకులు మంగళవారం కలికిరిలో మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వాల్మీకి సేవా సమితి వాల్మీకిపురం మండల అధ్యక్షుడు విష్ణుచైతన్య మాట్లాడుతూ రాష్ట్రంలోని వాల్మీకుల పరిస్థితిని గమనించి, వారిని ఎస్టీ జాబితాలోకి చేర్చే విధంగా కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. ఇందుకు స్పందించిన ఆయన మాట్లాడుతూ వాల్మీకులకు న్యాయం జరిగేలా, వాల్మీకుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చినట్లు సంఘ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు గంగులప్ప, రాజేంద్రప్రసాద్, గణి, బాలు, భరత్, రామకృష్ణ, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగ భద్రత కల్పించండి

- సీఎం చంద్రబాబుకు వైద్యమిత్రల వినతి
- నల్లరిబ్బన్లతో విధులకు హాజరు



నల్ల రిబ్బన్లతో నిరసన తెలుపుతున్న వైద్య మిత్రలు

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): చాలీచాలని వేతనాలతో 17 ఏళ్లుగా పనిచేస్తున్నాం. కుటుంబ పోషణ జరగక, పిల్లలను సక్రమంగా చదివించుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.. తమకు ఉద్యోగ భద్రత కల్పించి ఆదుకోవాలని డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ పథకంలో పనిచేస్తున్న వైద్యమిత్రలు, టీం లీడర్లు, ఆఫీసు అసోసియేట్లు, జిల్లా మేనేజర్లు సీఎం చంద్రబాబునాయుడును వేడుకొంటున్నారు. మంగళవారం వారు జిల్లా వ్యాప్తంగా నల్లరిబ్బన్లు తగిలించుకొని విధులకు హాజరై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా చిత్తశుద్ధితో, సేవాభావంతో ప్రజలకు సేవలందిస్తున్నామన్నారు. ఎందరో ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపిన చంద్రబాబు తమ జీవితాల్లో కూడా వెలుగులు నింపాలని వారు అభ్యర్థించారు. ఎన్టీఆర్ వైద్యసేవ పథకాన్ని ఇన్సూరెన్స్ మోడ్‌లోకి బదలాయింపు చేసిన పథకంలో పనిచేస్తున్న వైద్య మిత్రలు, టీం లీడర్లు, ఆఫీసు అసోషియేట్లు, జిల్లా మేనేజర్ తదితర క్షేత్ర స్థాయి సిబ్బంది ఉద్యోగాలకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూడాలని, వేతనాలు పెంచి, ఉద్యోగ భద్రత కల్పించాలని వారు ముఖ్యమంత్రికి విన్నవించారు.

## అగ్నిప్రమాదంలో రైతుకు అపార నష్టం

- చేతికందిన మొక్కజొన్న పంట అగ్నికి ఆహుతి
- రూ.4 లక్షలకు పైగా నష్టం
- ట్రాన్స్‌ఫార్మర్, మోటర్, కేబుల్ వైర్లు బుగ్గిపాలు

పెద్దతిప్పసముద్రం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఓ రైతు భూమిని లీజుకు తీసుకుని అప్పు చేసి పెట్టుబడులు పెట్టి సాగు చేసిన మొక్కజొన్న పంట అగ్ని ప్రమాదంలో కాలిపోవడంతో ఆ రైతుకు భారీ నష్టం వాటిల్లింది. చేతికందిన పంట అగ్నికి ఆహుతి కావడంతో ఆ రైతు కుటుంబం కన్నీటి పర్యంతమైంది. స్థానికుల కథనం మేరకు పెద్దతిప్పసముద్రం మండలం మద్దయ్యగారిపల్లెకు చెందిన మాజీ సర్పంచ్ నరసింహులు తనకు భూమి తక్కువగా ఉండడంతో ఆరు ఎకరాల భూమిని లీజుకు తీసుకుని అందులో నాలుగెకరాల్లో మొక్కజొన్న పంటను సాగు చేశాడు. పంట కూడా బాగా ఏపుగా పెరిగింది. దీంతో ఒకటి రెండు రోజుల్లో పంట కోద్దామని అనుకున్నారు. అయితే మంగళవారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తులు ఎవరో పొలం వద్ద నిప్పు పడేసినట్లు సమాచారం. అది కాస్త పంటకు వ్యాపించడంతో పంట అగ్నికి ఆహుతైంది. సమాచారాన్ని పరిసర ప్రాంత రైతులు నరసింహులుకు తెలియజేయడంతో ఆయన అగ్నిమాపక శాఖ వారికి సమాచారం అందించి మంటలను ఆర్పేందుకు ముమ్మరంగా ప్రయత్నాలు చేశారు. అయితే బాగా పండిన పంట కావడంతో మంటలు అదుపులోకి రాక రెండు ఎకరాలకు పైగా పంట పూర్తిగా కాలిపోయింది. పంటతో పాటుగా ట్రాన్స్‌ఫార్మర్, కేబుల్ వైర్లు, బోరు మోటర్ పైపులు అగ్నికి ఆహుతయ్యాయి. దీంతో దాదాపు రూ.4 లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్లు రైతు నరసింహులు కుటుంబ సభ్యులు బోరున విలపించారు. ప్రభుత్వం స్పందించి ఆ రైతును ఆదుకోవాలని స్థానిక రైతులు ప్రభుత్వాన్ని కోరారు.



పూర్తిగా కాలిపోయిన మొక్కజొన్న పంట, కాలిపోయిన పైపులైన్, మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

# మోసపోతున్నా... మార్పు రాదా!

జనం సొమ్మునే పెట్టుబడిగా పెట్టి నిర్వహిస్తున్న ప్రైవేటు చీటీల వ్యాపారం జిల్లాలో మూడు పువ్వు లు ఆరుకాయలుగా సాగుతోంది. ఎలాంటి అనుమతులు లేకపోయినా కొందరు ప్రైవేటుగా చీటీలు నిర్వహిస్తూ.. రూ.కోట్లలో డబ్బులు వసూళ్లు చేసి ఉన్నఫలంగా కుచ్చుటోపీ పెట్టి పరారవుతున్నారు. దీంతో లబోదిబోమంటూ బాధితులు పోలీసులను ఆశ్రయిస్తున్నారు. అయితే వీరి వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో పోలీ సులు తలలు పట్టుకుంటున్నారు. ఇలాంటి సంఘటనలు తరచూ జరుగుతున్నా చీటీల వ్యాపారం షరా మామూలే అన్నట్లు సాగుతోంది.

- జోరుగా ప్రైవేటు చీటీల వ్యాపారం
- రూ.లక్షల్లో వసూళ్లు చేసి.. నిర్వాహకులు పరారీ
- పోలీసులను ఆశ్రయిస్తున్న బాధితులు
- ఆధారాలు లేక... తలలు పట్టుకుంటున్న పోలీసులు



కడప క్రైం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి):కడపతో పాటు జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో అనుమతి లేని చీటీ లు ఎక్కువ నిర్వహిస్తున్నట్లు తెలుస్తుంది. కడప నగరంలోని చిన్నచౌకు, మృత్యుంజయకుంట, ఓంశాంతినగర్, శంకరాపురం, అక్కాయపల్లె, ఐటీఐ సర్కిల్, నబీకోట, రాజారెడ్డివీధి, మాసాపేట, అంగడివీధి, శంకరాపురం, ప్రొద్దుటూరు, మైదుకూరు, పోరుమామిళ్ల, జమ్మలమడుగు, పులివెందుల, బద్వేలు ఇలా ప్రతి ప్రాం తంలో వీధికొకరు చీటీలు నిర్వహిస్తున్నారు. అయితే తరచూ జిల్లాలో ఎక్కడో ఓ చోట నిర్వాహకులు రాత్రికి రాత్రే కుచ్చుటోపి పెట్టి పరారవుతన్నారు. దీంతో బాధితులు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించి తమ గోడు వెల్లబోసుకుంటున్నారు. అందులో ఇటీవల జరిగిన కొన్ని సంఘటనలను పరిశీలిస్తే..

కడప నగరంలోని అక్కాయపల్లెలో భార్యా భర్త చీటీలు వేసి రూ.కోట్లు వసూళ్లు చేసి ఆపై బోర్డు తిప్పి పరారీ అయ్యా రు. డబ్బు కట్టినట్లుగా బాధితుల వద్ద ఎలాంటి ఆధారాలు లేవు. ఈ వ్యవహారంపై పలువురు తాలుకా పోలీసులను ఆశ్రయించడంతో దంపతులపై చీటింగ్ కేసు నమోదు చేసి ఇటీవల నిర్వాహకుడిని అరెస్టు చేశారు. కడప నగరం నాగరాజుపేటలో ఓ మహిళ రెండు నెలల క్రితం చీటీలు వేసి భారీ ఎత్తున సభ్యుల నుంచి డబ్బులు వసూళ్లు చేసుకుని పరారైంది. ఇదే ఏరియాలో మరో వ్యక్తి కోట్ల రూపాయలు చీటీలు వేసి చివరికి ఐపీ దాఖలు చేసి పరారయ్యాడు. కడప నగరంతో పాటు జిల్లాలో తరచూ ఇలాంటి మోసాలు బయటపడుతున్నాయి. అయితే బాధితులు దగ్గర సరైన ఆధారాలు లేకపోవడంతో పోలీసులు ఏం చేయాలో అర్థకంకాక తలలు పట్టుకుంటున్నారు.

**అనుమతులు లేకుండా నిర్వహణ**

ప్రైవేటు చీటీల వ్యాపారానికి ప్రభుత్వ అనుమతి లేకపోయినా యథేచ్ఛగా నిర్వహిస్తున్నారు. నమ్మకమే పెట్టుబడిగా ఈ దందా సాగుతుండడంతో అటు అధికారులు, పోలీసులు కూడా వీటిని కట్టడి చేయలేకపోతున్నారు. ఇటీవల కడప తాలుకా పరిధిలో చీటీల వ్యాపారం చేసి బోర్డు తిప్పిన ఓ దంపతులకు కడప కోర్టు జైలు శిక్ష విధించడంతో పాటు జరిమానా కూడా విధించింది. అలాగే రాజారెడ్డివీధికి చెందిన మరో ఇరువురికి కూడా కోర్టులో శిక్ష పడింది. అయినా కొందరిలో మార్పు కనిపించడంలేదు. ముఖ్యంగా ఈ చీటీల ఉచ్చులో మహిళలే ఇరుక్కుంటున్నారు. చట్టపరిధిలో అనుమతి పొందిన చీటీల్లోని సభ్యులకు కచ్చితంగా ఆర్థికపరమైన భద్రత ఉంటుంది. చట్టబద్ధత లేని చీటీ వ్యాపా రంతో ప్రజల జీవితాలు నాశనం అవుతున్నాయి. ముఖ్యంగా మధ్యతరగతి మహిళలు చీటీల నిర్వాహకుల ఉచ్చులో పడి మోసపోతున్నారు.

**చీటీల వ్యాపారుల మాటలు నమ్మి మోసపోవద్దు**

ఎవరూ కూడా ప్రైవేటు చీటీలు వేసి మోసపోవద్దు. ముఖ్యంగా ప్రైవేటు చీటీలపై మహిళలే డబ్బులు చెల్లిస్తూ ఉన్నారు. చట్టబద్ధత ఉన్న వాటిల్లోనే డబ్బులు కట్టాలి. ఈ ప్రైవేటు చీటీలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

-వెంకటేశ్వర్లు, కడప డీఎస్పీ

## గండికోటను సందర్శించిన రాష్ట్ర పర్యాటకశాఖ కార్యదర్శి



గండికోటలో ధాన్యాగారాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర పర్యాటక శాఖ కార్యదర్శి అజయ్‌జైన్, కలెక్టర్ శ్రీధర్, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి

జమ్మలమడుగు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): పర్యాటక ప్రాంతమైన గండికోటను మంగళవారం రాష్ట్ర పర్యాటక శాఖ కార్యదర్శి అజయ్‌జైన్, కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి ఇతర అధికారులు సందర్శించారు. ముందుగా వారు గండికోటలోని ఏపీ టూరిజం హోటల్ వద్ద పరిశీలించారు. గతంలో ఆగిపోయిన రోప్‌వే పిల్లర్స్‌ను, లోయ పక్కనే అనుమతి లేకుండా వేసిన టెంట్లను పరిశీలించారు. అనంతరం గండికోటలోని ధాన్యాగారాన్ని, రంగనాథస్వామి, మాధవరాయస్వామి ఆలయాలను సందర్శించారు. పర్యాటక అభివృద్ధి ప్రణాళికలో భాగంగా ఒబెరాయ్ స్టార్‌హోటల్ నిర్మించే ప్రాంతాన్ని, గండికోట రిజర్వాయర్ బ్యాక్‌వాటర్, తదితర వాటికి సంబంధించి చర్చించారు. అడ్వెంచర్ ప్రాంతంలో చేపట్టే బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించి పరిశీలించారు. ఆర్డీవో సాయిశ్రీ, తహసీల్దారు శ్రీనివాసులరెడ్డి, టూరిజం అధికారి సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ట్రాన్స్‌ఫార్మర్లలో రాగితీగ చోరీ చేసే దొంగల అరెస్టు



పట్టుబడ్డ దొంగలను చూపుతున్న పోలీసులు

చక్రాయపేట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ ప్రాంతాలలో ట్రాన్స్‌ఫార్మర్లలోని రాగితీగను చోరీచేసే దొంగలను పోలీసులు అరెస్టు చేశా రు. పులివెందుల డీఎస్పీ, సీఐల ఆదేశాల మేరకు ట్రాన్స్‌ఫార్మర్‌ల దొంగలపై నిఘా పెట్టిన చక్రాయపేట ఎస్ఐ కృష్ణయ్య మంగళవారం ఇద్దరు దొంగలను అరెస్టు చేశారు. వివరాల్లోకెళితే... చెన్నూరు మండలం రుద్రభారత్‌పేట శాటిలైట్ సిటీకి చెందిన ఇ.మల్లికార్జున, శంకర్‌లు గత కొన్ని రోజులుగా ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి అందులోని రాగితీగను చోరీ చేసే వారు. ఈ నేపధ్యంలో చక్రాయపేట ఎస్ఐ తమ సిబ్బందితో గాలివీడు క్రాస్ వద్ద ఎస్ఐ తమ సిబ్బందితో వాహనాలను తనిఖీ చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు మోటర్ బైకులో నాగులగుట్టపల్లె వైపు పరుగులు తీశా రు. వారిని వెంబడించి పట్టుకొని తమదైన శైలిలో విచారించగా చక్రాయపేట మండలంలో మూడు ట్రాన్స్‌ఫార్మర్‌లను దొంగలించామని తెలిపారు. అలాగే జిల్లాలోని వేముల, వేంపల్లె, లింగాల, పెండ్లిమర్రి, పులివెందుల, చింతకొమ్మదిన్నె, జమ్మలమడుగు, ముద్దనూరు, ఖాజీపేట, రిమ్స్, జమ్మలమడుగు, మైలవరం, పెండ్లిమర్రి ప్రాంతాలలో 27 ట్రాన్స్‌ఫార్మర్‌లను పగులగొట్టి వాటిలోని రాగివైర్లను దొంగలించామని ఒప్పుకున్నారు. ఈ మేరకు కడప ఎయిర్ పోర్టు వద్ద కంపచెట్లలో దాచిన సుమారు 180 కేజీల రాగివైరు, ట్రాన్స్‌ఫార్మర్లను విప్పడానికి వాడే పరికరాలను, పల్సర్ బైకును స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా చక్రాయపేట పోలీసులను డీఎస్పీ, సీఐలు అభినందించారు.

## పూర్వ ప్రాథమిక విద్య బలోపేతానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ నిత్యానందరాజు

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యో తి): విద్యాశాఖ బలోపేతానికి పూర్వ ప్రాథమిక విద్య ప్రథమ ప్రాధాన్యత వహిస్తుందని సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ నిత్యానందరాజు సూచించారు. మంగళవారం కడప నగరం జయనగర్ కాలనీ నగరపాలక ఉన్నత పాఠశాలలో అంగన్వాడీ వర్కర్స్ ఆరు రోజుల శిక్షణ కార్యక్రమం జిల్లా సమగ్ర శిక్ష, ఐసీడీఎస్ సంయుక్త ఆధ్వర్యం లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాశాఖకు అంగన్వాడీకి అనుసంధానంగా పనిచేయాలని.. అప్పుడే పూర్వ ప్రాథమిక విద్య నుంచి ప్రాథమిక విద్య, మాధ్యమిక విద్య, ఉన్నత విద్య బలోపేతం చెందుతాయన్నారు. కడప మండల విద్యాశాఖ అధికారి దుద్దికుంట గంగిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థలో సమూల మార్పుల్లో భాగంగా న్యూ క్లస్టర్ విధానంలో బేసిక్ ప్రైమరీ స్కూళ్లకు అంగన్వాడీలను అనుసంధానం చేస్తూ పూర్వ ప్రాథమిక విద్య, ప్రాథమిక విద్యను బలోపేతం చేసేందుకు ఈకార్యక్రమం ప్రారంభించినట్లు తెలిపారు. జిల్లా జ్ఞానజ్యో తి డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ కిరణ్ రథం, రీసోర్స్ పర్సన్ శోభారాణి, సూపర్‌వైజర్ ప్రశాంతిలు ప్రసంగించారు. కార్యక్రమంలో కడప నగరంలోని ఆరు సెక్టార్ల సూపర్‌వైజర్లు, రీసోర్స్ పర్సన్లు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరామ ఎత్తిపోతల పథకానికి నిధులు విడుదల చేయాలి

- కలెక్టర్‌కు సాయిలోకేష్ వినతి



కలెక్టర్ శ్రీధర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న సాయి లోకేష్

రాజంపేట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఒంటిమిట్ట చెరువుకు సోమశిల వెనుకజలాల ద్వారా నీరందించే శ్రీరామ ఎత్తి పోతల పథకం సిమెంటు పైపులైన్లు దెబ్బ తిన్నందున వాటి స్థానంలో ఇనుప పైపు లైన్ల కోసం 11 కోట్ల రూపాయలు మంజూరు చేయాలని కోరుతూ కడప కలెక్టర్ శ్రీధర్‌కు అన్నమయ్య జిల్లా బీజేపీ అధ్యక్షుడు సాయిలోకేష్ వినతిపత్రం సమర్పించారు. మంగళవారం కడపకు వెళ్లి కలెక్టర్‌ను కలిసి శ్రీరామ ఎత్తిపోతల పథకం 13 కిలోమీటర్లు పొడవున వేసిన సిమెంటు పైపులైన్లు దెబ్బతిన్నాయని తెలిపారు. ఒంటమిట్ట చెరువుకు నీరు అందించి ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ పథకాన్ని ఏర్పాటు చేశారన్నారు. ఇందుకు కలెక్టర్ సానుకూలగా స్పందించినట్లు సాయిలోకేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి కృష్ణయాదవ్, జయకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


## భారతీయ సంస్కృతికి నిదర్శనం రామాయణం



ప్రారంభోత్సవ కార్యక్రమంలో వైవీయూ ఇన్‌చార్జి వీసీ క్రిష్ణారెడ్డి

కడప కల్చరల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): భారతీయ సంస్కృతికి నిలువెత్తునిదర్శనం రామాయణం అని యోగివేమన విశ్వవిద్యాలయం ఇన్‌చార్జ్ వైస్‌చాన్సలర్ ఆచార్య కె.క్రిష్ణారెడ్డి అన్నారు. రాముని గుడి అంటూ లేని గ్రామం మన భారతదేశంలో ఉండదన్నారు. వైవీయూ ఆధ్వర్యంలోని సీపీ బ్రౌన్ భాషాపరిశోధన కేంద్రంలో రామాయణం, సామాజిక దృక్పథం అనే అంశంపై జరుగతున్న రెండు రోజుల అంతర్జాతీయ సదస్సులో భాగంగా మంగళవారం ఉదయం ప్రారంభ సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిధిగా ఆచార్య క్రిష్టారెడ్డి హాజరై మాట్లాడారు. రామాయణంలోని ప్రతిపాత్ర నాటికి నేటికీ రేపటికి కూడా గొప్ప సందేశాన్ని ఇస్తుందన్నారు.సభకు అధ్యక్షత వహించిన ప్రాచీన విశిష్ట అధ్యయన కేంద్రం సంచాలకులు ఆచార్య ఎం.సంపత్‌కుమార్ మాట్లాడుతూ రామాయణ కావ్యాన్ని ఆధ్యాత్మిక గ్రంథంగా కాకుండా ఆధునిక సమాజానికి ఉపకరించే తీరును సదస్సు ద్వారా తెలియజెప్పాలనే లక్ష్యంతో ఈకార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో బ్రౌన్‌భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య పార్వతి, ఆచార్య మలయవాసిని, స్వామి తురియానంద, భూతపురి గోపాలక్రిష్ణశాస్త్రి, డాక్టర్ చింతకంట శివారెడ్డి, వైవీయూ అధ్యాపకులు ఆచార్య ఎంఎం వినోదిని, రాంప్రసాద్‌రెడ్డి, ఆచార్య ఈశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బోలేరో క్యాంపర్ ఢీ.. 14 గొర్రెలు మృతి



కడప-తాడిపత్రి ప్రధాన రహదారిపై మృతి చెందిన గొర్రెలు

కొండాపురం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండ్లూరు గ్రామం వద్ద మంగళవారం బొలెరో క్యాంపర్ వాహనం ఢీకొనడంతో 14 గొర్రెలు మృతి చెందాయి. మండలంలోని చౌటిపల్లె గ్రామానికి చెందిన పుల్లగూర సుబ్బారెడ్డి అనే రైతు కడప-తాడిపత్రి ప్రధాన రహదారిపై గొర్రెలను మేపు కోసం తీసుకెళుతుండగా ఆదోనికి వంటనూనె లోడుతో వెళుతున్న బొలెరో క్యాంపర్ వేగంగా గొర్రెలమందను ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాయి. వీటి విలువ సుమారు రూ.2లక్షల వరకు ఉంటుందని తెలిపారు. తనకు జీవనధారమైన గొర్రెలు మృతి చెందడంతో బోరున విలపిస్తున్నాడు. ప్రభుత్వం తగిన ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని కోరుతున్నాడు.

## వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలి



సర్వేను పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి నాగరాజు

సికెదిన్నె, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రజలు వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి నాగరాజు తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం జె.నారాయణపురంలో మంగళవారం రాష్ట్రీయ బాల ఆరోగ్య కార్యక్రమం కోఆర్డినేటర్ డాక్టర్ రమేష్‌తో కలిసి సంక్రమిత, అసంక్రమిత వ్యాధుల సర్వే 3.0ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో వ్యాధుల బారిన పడటానికి అవకాశం గల వ్యక్తులను గుర్తించడానికి పరీక్షలు జరపాలన్నారు. అనుమానితులను నిపుణులైన వైద్యుల వద్దకు పంపితే నిర్ధారించడం జరుగుతుందన్నారు. పై వ్యాధులను గుర్తించడానికే సర్వే జరుగుతుందని, దేశవ్యాప్తంగా జరిగే ఈ సర్వేకు ప్రజలు సహకరించాలన్నారు. ఈ సందర్భంగా సర్వేలో లక్ష్యాలు చేరుకోని దాదాపు 17 మంది సిబ్బందికి షోకాజ్ నోటీసు లు జారీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారి రాఘవేంద్ర, జనార్థన్, జయరత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఏఐటీయూసీ కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవం


రైల్వేకోడూరు రూరల్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): జిల్లా ఏఐటీ యూసీ గౌరవాధ్యక్షుడుగా తు మ్మల రాధాకృష్ణ, అధ్యక్షుడుగా మాదరాజు గంగాధర్ ఏకగ్రీ వంగా ఎన్నికయ్యారు. పట్టణం లోని పాతబజార్ ఎలిమెంటరీ పాఠశాల వద్ద నిర్వహించిన ఏఐటీ యూసీ జిల్లా ప్రథమ మహాసభల్లో మంగళవారం ఏఐటీయూసీ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా వర్కింగ్ అధ్యక్షుడుగా మదనపల్లికి చెందిన వర్రి సురేష్ కుమార్, ఉపాధ్యక్షుడుగా గాలి చంద్ర (రాజంపేట), పోకూరి మురళి(ఏపీఎండీసీ), నర్సింహులు (పీలేరు), ప్రధాన కార్యదర్శిగా మదన పల్లికి చెందిన ఎం.సాంబశివ. ఉప ప్రధాన కార్యదర్శులుగా సలీం బాషా (బి.కొత్తకోట) సహాయ కార్యదర్శిగా సికిందర్(రాజంపేట), వేణుగోపాల్ రెడ్డి (బి.కొత్తకోట), కృష్ణ చైతన్య (రైల్వేకోడూరు). జిల్లాకోశాధికారిగా సరోజమ్మ(పుల్లంపేట) ఎన్నుకున్నారు.

## పదో తరగతి విద్యార్థిని ఆత్మహత్య



కడప(క్రైం), ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): కడప నగరం వైఎస్ఆర్ కాలనీకి చెందిన సుచిత్ర (15) అనే విద్యార్థిని మంగళవారం ఇంట్లో ఎవరూలేని సమ యంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు చిన్నచౌకు ఎస్ఐ రవికుమార్ తెలిపారు. ఆయన వివరాల మేరకు.. వైఎస్ఆర్ కాలనీలో నివాసం ఉంటున్న దేవ కుమార్, ప్రభావతిల కుమార్తె సుచిత్ర మున్సిపల్ మెయిన్ స్కూల్‌లో పదో తరగతి చదువుకుటుంది. సుచిత్ర అనారోగ్యంతో సరిగా స్కూల్‌కు వెళ్లేదికాదు. ఈక్రమంలో హాజరు సరిగా లేకపోవడంతో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థిని తల్లిదండ్రులకు ఫోన్ చేసి చెప్పారు. దీంతో కలతచెంది మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

## ఆంజనేయస్వామికి బంగారు హారం బహూకరణ



ఆంజనేయస్వామికి బంగారు హారం అందజేస్తున్న భక్తులు

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక పాత మార్కెట్‌లోని ఆంజనేయస్వామికి భక్తులు రూ.14 లక్షలు విలువైన 153 గ్రాముల రామ్‌పరివార్ బంగారు హారాన్ని అందజేశారు. వెదుర్ల బజారుకు చెందిన సాయిప్రసాద్ తన సతీమణి అమ్మణ్ణి జ్ఞాపకార్థం స్వామివారికి బంగారు హారం తయారు చేయించారు. మంగళవారం వారి కుమారుడు కిరణ్, కోడలు సత్యలతలు ఆలయ ఛైర్మన్ సత్యనారాయణ, ఈవో రమణారెడ్డిలకు బంగారు హారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారికి అలంకరించారు. హారాన్ని బహూకరించిన సాయిప్రసాద్ కుటుంబ సభ్యులకు ఆలయ ఛైర్మన్, ఈవోలు కృతజ్ఞతలు తెలిపారు.

## విద్యుత్ వైర్లు తగిలి టిప్పర్ దగ్ధం

ఎర్రగుంట్ల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నదండ్లూరు గ్రామం వద్ద విద్యుత్ వైర్లు తగిలి టిప్పర్ దగ్ధమైంది. చిన్నదండ్లూరు గ్రామానికి నిర్మిస్తున్న రోడ్డుకు టిప్పర్ ద్వారా మట్టిని తోలుతున్నారు. టిప్పర్ అన్‌లోడ్ చేసే సమయంలో విద్యుత్ వైర్లు తగలడంతో మంటలు వ్యాపించి పూర్తిగా కాలిపోయింది. ఫైర్ ఇంజిన్ వచ్చి ఆపేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. కాగా, విద్యుత్‌షాక్‌కు గురైన డ్రైవర్ భయపడి కిందకు దూకడంతో గాయపడ్డాడు. అతనిని చికిత్స నిమిత్తం ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు.

## 22 నుంచి ప్రాజెక్టుల ప్రాంతీయ సదస్సు

కడప సెవెన్ రోడ్స్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): కడపలో ఈనెల 22 నుంచి 24 వరకు జరిగే ప్రాజెక్టుల ప్రాంతీయ మహాసభ జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయ న మాట్లాడుతూ రూ.80వేల కోట్ల అంచనా వ్యయంతో గోదావరి-బనకచర్ల ఎత్తిపోతల పథకం కేవలం కాంట్రాక్టర్ల కడుపునింపి తద్వారా ఎన్నికల నిధి పోగుచేసుకోవడానికి ఉపయోగపడుతుందని ఆరోపించారు. పోలవరం పూర్తయితే పట్టిసీమ ఎత్తిపోతల పథకానికి ప్రాధాన్యత ఉండదని తెలిసినా రూ.1600 కోట్లు ఖర్చు చేశారన్నారు. సీమలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులకు రూ.10 వేల కోట్లు కేటాయిస్తే ప్రాధాన్యత క్రమంలో పంట కాల్వల పూర్తి ద్వారా 10 లక్షల ఎకరాల ఆయకట్టు అభివృద్ధి చెందుతుందన్నారు. సీమపట్ల, ప్రాజెక్టుల పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే కృష్ణానది యాజమాన్య బోర్డును కర్నూలులో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కడపలో జరిగే రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం జిల్లాల ప్రాజెక్టుల ప్రాం తీయ మహాసభకు ఏఐకేఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య, నీటిపారుదల రంగ నిపుణులు టి.లక్ష్మీనారాయణ, బొజ్జ దశరథరామిరెడ్డి, డాక్టర్ ఎన్.తులసిరెడ్డి, 100 టీఎంసీ రామాంజనేయులు, ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ తదితరులు పాల్గొంటారన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకటశివ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ఫైర్‌స్టేషన్ తరలిపోతోంది..!

- త్వరలో టెండర్లు పిలువనున్న అధికారులు
- తుమ్మణంగుట్ట టోల్‌గేట్ దగ్గర భవనానికి స్థలం కేటాయింపు
- 15 కిలో మీటర్లకుపైగా దూరంలో స్థలం ఇవ్వడంపై స్థానికుల ఆగ్రహం
- ములకలచెరువు నుంచి దూరంగా తరలిస్తే ఇబ్బందులు తప్పవంటున్న జనం


ములకలచెరువు అగ్నిమాపక కేంద్రం

ములకలచెరువు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ములకలచెరువు ఫైర్‌స్టేషన్ తరలిపోతోంది. రెవెన్యూ అధికారులు ఇష్టానుసారంగా భవన నిర్మాణానికి స్థలం కేటాయించడంతో ఈ పరిస్థితి నెలకొంది. ములకలచెరువు చుట్టు పక్కల కాకుండా 15 కిలోమీటర్లకుపైగా దూరంలో స్థలం కేటాయించడంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. అత్యవసర సమయాల్లో ముఖ్యంగా వేసవికాలంలో ఎక్కడైనా అగ్నిప్రమాదాలు చోటుచేసుకుంటే అగ్నిమాపక వాహనం అక్కడికి వెళ్లాలంటే మండల కేంద్రానికి సమీపంలో ఉంటే సకాలంలో వెళ్లడానికి వీలుకలుగుతుందని అలాకాకుండా దూరంగా ఉంటే వాహనం వెళ్లేలోగా ప్రమాదాన్ని నివారించడం కష్టమని మండలంతో పాటు నియోజకవర్గ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ కేంద్రం పరిధిలోకి ములకలచెరువు, బి.కొత్తకోట, పెద్దతిప్పసముద్రం, పెద్దమండ్యం, తంబళ్లపల్లె మండలాలు వస్తాయి. ములకలచెరువులో 2004లో అగ్నిమాపక కేంద్రాన్ని ప్రారంభించారు. అప్పట్లో సింగిల్ విండో భవనంలో ఏర్పాటు చేశారు. తరువాత మార్కెట్ యార్డులోని ఇరుకైన గదుల్లోకి మార్చారు. అయితే ఏళ్ల తరబడిగా పక్కా భవనం లేకపోవడంతో అవస్థలు తప్పడం కాదు. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అగ్నిమాపక కేంద్రం పక్కాభవనం నిర్మాణానికి రూ.2.25 కోట్లు విడుదల చేసింది. భవన నిర్మాణానికి అగ్నిమాపక శాఖ ఉన్నతాదికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ఈ నెల 21వతేదీన టెండర్ల ప్రక్రియ కూడా ప్రారంభంకానుంది. ఇది ఇలా ఉంటే రెవెన్యూ అధికారులు మాత్రం నూతన భవనం నిర్మాణానికి ములకలచెరువు చుట్టు పక్కల కాకుండా తుమ్మణంగుట్ట టోల్ గేట్ దగ్గర స్థలాన్ని కేటాయించడం ఆ స్థలం ములకలచెరువుకు 15కిలో మీటర్లకుపైగా దూరం ఉండడంతో రెవెన్యూ అధికారుల తీరుపై ప్రజలు మండిపడుతున్నారు. అత్యవసర విభాగమైన అగ్నిమాపక కేంద్రానికి మండల కేంద్రంలో స్థలం ఇవ్వకుండా అంత దూరంలో ఏర్పాటు చేయడంవల్ల ప్రయోజనం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడే చుట్టు పక్కల ఉండాల్సిన అగ్నిమాపక కేంద్రం ఎందుకు అంత దూరం తరలిస్తున్నారో చెప్పాలని ప్రశ్నిస్తున్నారు. ములకలచెరువు చుట్టు పక్కలే స్థలం కేటాయించి ఇక్కడే భవన నిర్మాణం చేపట్టేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. టెండర్ ప్రక్రియ పూర్తయితే 15 కిలో మీటర్ల దూరంలో కేటాయించిన స్థలంలో భవన నిర్మాణం ప్రారంభమవుతుందని ఈలోగానే ఉన్నతాధికారులు వెంటనే ప్రత్యేక చొరవ తీసుకుని ములకలచెరువుకు చుట్టు పక్కలే స్థలం కేటాయించి ఇక్కడే భవనం నిర్మాణం చేపట్టి ఫైర్‌స్టేషన్ తరలిపోకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకపోతే ఆందోళన కార్యక్రమాలకు సైతం వెనుకాడమని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

## కార్పొరేషన్ ఇంటర్వ్యూలకు 328 మంది హాజరు


గుర్రంకొండలో కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

గుర్రంకొండ, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): గుర్రంకొండ మండలంలో కార్పొరేషన్ రుణాలకు మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ఇంటర్వ్యూలకు 328 మంది అభ్యర్థులు హాజరయ్యారు. గుర్రంకొండ మండలానికి కాపు కార్పొరేషన్‌లో 11, బీసీ కార్పొరేషన్ 30, ఈబీసీకి 5 మొత్తం 46 యూనిట్లు మంజూరు కాగా ఈ యూనిట్లకు దరఖాస్తు చేసుకొన్న 328 మందికి బ్యాంక్ అధికారులు, మండల అధికారులు ఇంటర్వ్యూలను నిర్వహించారు. అర్హులైన అభ్యర్థులకు ఫోన్ ద్వారా సమాచారమిస్తామని ఎంపీడీవో వెంకటేశులు తెలిపారు.

## బీసీ కార్పొరేషన్ రుణాలకు నేడు ఇంటర్వ్యూలు

రామసముద్రం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారికి బుధవారం ఉదయం 11.00గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు ఉంటాయని ఎంపీడీవో భానుప్రసాద్ తెలిపారు. దరఖాస్తుదారులు తమ ఒరిజినల్ ఆధార్, కుల, ఆదాయ సర్టిఫికెట్, రైస్ కార్డు, విద్యార్హత సర్టిఫికెట్, బ్యాంక్ పాస్ బుక్‌లతో పాటు ఒక జత జిరాక్స్ కాపీలతో స్వయంగా హాజరు కావాలన్నారు. కాగా మండలానికి మొత్తం 50 యూనిట్లకు గాను రూ.కోటి రుణం మంజూరు చేయనున్నట్లు ఆయన చెప్పారు. ఇందుకు 295మంది దరఖాస్తులు చేసుకున్నట్లు ఎంపీడీవో తెలిపారు.

**ములకలచెరువులో:** స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం స్వయం ఉపాధి రుణాలకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో హరినారాయణ తెలిపారు. మండలంలో బీసీ కార్పొరేషన్, కాపు, ఈబీసీ, తదితరులకు మొత్తం 53 యూనిట్లకు గానూ 400 మంది దరఖాస్తులు చేసుకున్నట్లు చెప్పారు. ములకలచెరువు, బురకాయలకోట ఇండియన్ బ్యాంక్, చౌడసముద్రం సప్తగిరి గ్రామీణ బ్యాంకు పరిధిలో దరఖాస్తు చేసుకున్న యువతీ, యువకులు తప్పనిసరిగా ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు.

## మదనపల్లెలో రేపు ఇంటర్వ్యూలు

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలానికి సంబంధించి బీసీ కార్పొరేషన్ కింద మంజూరు చేయనున్న రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు గురువారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో తాజ్‌మస్రూర్ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉదయం 10.30గంటల నుంచి ఐదు బ్యాంకుల ప్రతినిధులు నిర్వహించే ఇంటర్వ్యూలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు హాజరు కావాలన్నారు. అభ్యర్థులు దరఖాస్తు, ఒరిజినల్ సర్టిఫికేట్లు, ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, పోస్టుకార్డు, ఒరిజినల్ బ్యాంకు ఖాతా పుస్తకం తప్పనిసరిగా తీసుకురావాలని ఎంపీడీవో కోరారు.

## గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

వాల్మీకిపురం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి ఐదో తరగతి ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కల్పన మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మార్చి 6వ తేదీలోపు మీసేవా కేంద్రాలు, పాఠశాలలో సంప్రదించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఐదో తరగతి ప్రవేశం కోసం ఎస్సీ, ఎస్టీలు 2012 సెప్టెంబరు 1వ తేదీ 2016 ఆగస్టు 31 మధ్య పుట్టినవారై ఉండాలన్నారు., ఇతరులు 2014 సెప్టెంబరు 1వతేదీ, 2016 ఆగస్టు 31 మధ్యలో జన్మించి ఉండాలన్నారు. ప్రస్తుతం నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు ఏప్రిల్ 6న జరిగే ప్రవేశ పరీక్షకు ఉదయం 10గంటల సమయంలో తప్పక హాజరు కావాలని తెలియజేశారు. గురుకులంలో ప్రవేశానికి పాఠశాలలో దరఖాస్తు చేసుకున్నచో ఎటువంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదని, ఇతర వివరాలకు 7989128742, 8331823512నెంబర్లను సంప్రదించాలన్నారు.

## డ్రై క్లీనింగ్‌పై ఉచిత శిక్షణ

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ధాత్రి స్కిల్ ట్రైనింగ్ సెంటర్‌లో మంగళవారం పీఎం విశ్వక్రమ యోజన ద్వారా ధాత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో డ్రై క్లీనింగ్‌పై ఉచిత శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ధాత్రి ఫౌండేషన్ నిర్వాహకులు డాక్టర్ స్వాతి చక్రపాణిలు మాట్లాడుతూ ధాత్రి స్కిల్ ట్రైనింగ్ సెంటర్‌లో ఉచితంగా డ్రై క్లీనింగ్‌పై శిక్షణ ఇచ్చి ఉచితంగా డ్రై క్లీనింగ్ మెటరీయల్ అందించామన్నారు. కార్యక్రమంలో ధాత్రి ఫౌండేషన్ సభ్యులు, దోబీగాట్ నిర్వాహకులు పాల్గొన్నారు.

## ఐదుగురు నిందితులకు జరిమానా, జైలు శిక్ష

కలకడ, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి):మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడిన కేసుల్లో ఐదు మంది నిందితులకు న్యాయస్థానం జరిమానాతో పాటు జైలుశిక్ష విధించినట్లు ఎస్‌ఐ రామాంజనేయులు తెలిపారు. ఈ కేసుల్లో నిందితులైన మహ్మద్, షాదిక్, శ్రీను, కిరణ్‌కుమార్, సురేంద్రలను కోర్టులో హాజరుపరచగా. వారికి వాల్మీకీపురం జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఒక్కొక్కరికి జరిమానా రూ.11 వేలుతోపాటు వారం రోజుల పాటు జైలు శిక్ష విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

## ఏఐటీయూసీ జిల్లా నూతన కమిటీ ఎన్నిక

- అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా గంగాధర్, సాంబశివ



అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంగాధర్, సాంబశివ

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి):ఏఐటీయూసీ అన్నమయ్య జిల్లా నూతన కార్యవర్గాన్ని ఈ నెల 16, 17 తేదీల్లో రైల్వే కోడూరులో నిర్వహించిన జిల్లా ప్రథమ మహాసభల్లో ఎన్నుకున్నారు. ఇందులో అన్నమయ్య జిల్లా నూతన గౌరవాధ్యక్షుడిగా తుమ్మల రాధాకృష్ణ, అధ్యక్షుడిగా మాదరాజు గంగాధర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వర్రి సురేష్‌కుమార్, ఉపాధ్యక్షులుగా గాలిచంద్ర, పోకూరి మురళి, నరసింహులు, ప్రధాన కార్యదర్శిగా సాంబశివ, ఉప ప్రధాన కార్యదర్శులుగా సలీంబాషా, సహాయ కార్యదర్శులుగా సికింధర్, వేణుగోపాల్‌రెడ్డి, కృష్ణచైతన్య, జిల్లా కోశాధికారిగా సరోజమ్మను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అన్నమయ్య ప్రాజెక్టును పునర్నిర్మాణానికి అవసరమైన నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఏపీఎండీఎస్ సంస్థలో పని చేస్తున్న ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని, విశాఖ ఉక్కు పరిశ్రమను సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు.

## ఆటోను ఢీకొన్న కారు..ఐదుగురికి తీవ్రగాయాలు

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి):ఆటోను కారు ఢీకొన్న ప్రమాదంలో ఐదుగురు గాయపడిన సంఘటన మదనపల్లె మండలం, సీటీఎంలో చోటుచేసుకుంది. మదనపల్లె తాలుకా సీఐ కళా వెంకటరమణ తెలిపిన వివరాల మేరకు మదనపల్లె మండలం, సీటీఎం గ్రామంలోని మదనపల్లె స్పినింగ్ మిల్ సమీపంలో సీటీఎం నుంచి ప్యాసిజర్స్ ఆటోను మదనపల్లె నుంచి వెళతున్న కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఐదుగురు గాయపడి మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స నిమిత్త్యం వచ్చారు. ఇందులో తీవ్రంగా గాయపడిన వేమారెడ్డి ప్రథమ చికిత్స అనంతరం తిరుపతికి మెరుగైన వైద్యం కోసం డాక్టర్లు రెఫర్ చేశారు. మిగిలిన వారు బాలాజీ నగర్‌కు చెందిన బావజాన్ (36), రామసముద్రం మండలం చింపరపల్లెకు చెందిన దంపతులు అలివేలమ్మ(55),చిన్నబ్బయ్య(60), కౌసర్(36) గాయాలతో మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. తాలుకా సీఐ కళా వెంకటరమణ కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

## మహిళ ఆత్మహత్యాయత్నం

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి):అనారోగ్యంతో బాధపడుతూ మనస్థాపానికి గురైన ఓ మహిళ మంగళవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. పోలీసుల కథనం మేరకు తంబళ్లపల్లె మండలం, కోసువారిపల్లె గ్రామం కనిగానిపల్లెకు చెందిన ఉత్తన్న భార్య రత్నమ్మ(35) షుగర్ ఉండడంతో కాలికి తగిలిన గాయం చాలా రోజులుగా నయం కాకుండా ఇబ్బందులు పెట్టుతుండడంతో జిల్లేడు పాలు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. విషయం తెలుసుకున్న భర్త వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. తంబళ్లపల్లె పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## కోళ్లఫారాల వద్ద పరిశుభ్రత పాటించాలి

పెద్దమండ్యం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి) కోళ్లఫారాల వద్ద నిర్వాహకులు ఎప్పటికప్పుడు పరిశుభ్రత పాటించాలని ఎంపీడీవో శ్రీధర్‌రావు సూచించారు. గ్రామాలలో ఈగలు బెడద నివారించాలని మండలంలోని శివపురం గ్రామ ప్రజలు ఎంపీడీవో శ్రీధర్‌రావుకు మంగళవారం ఫిర్యాదు చేశారు. మండలం లోని శివపురం గ్రామ పంచాయతీలోని శివపురం, గొల్లపల్లి, కనకంటివారిపల్లి, బుసిరెడ్డిగారిపల్లి గ్రామాల్లో ఈగల బెడద ఎక్కువగా ఉందని దీంతో ప్రతి రోజు అన్నంపై అవి వాలడంతో తిండి కూడ తినలేకపోతున్నామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ సమీపంలో ఉన్న పలు కోళ్లఫారాల్లో పరిశుభ్రత పాటించక పోవడంతో ఈగలు ఎక్కువయ్యాయని గ్రామస్థులు ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు.. ఇందుకు స్పందించిన ఎంపీడీవో శివపురం గ్రామ పంచాయతీలో , సర్పంచ్ గంగులమ్మ తదితరులతో కలిసి పర్యటించి కోళ్లఫారం నిర్వాహకులతో మాట్లాడారు. రెండు రోజుల్లో ఈగలను పిచికారి మందులు స్ప్రే చేసి నివారిస్తామని కోళ్లఫారం నిర్వాహకులు తెలిపారు. గ్రామ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు అన్నదానం



వాల్మీకిపురం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం పట్టణానికి చెందిన మొర్రంరెడ్డి కుమార్‌రెడ్డి రెండవ వర్ధంతి సందర్భంగా ఆయన కుమారుడు రామ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మానవతా స్వచ్చంద సేవా సంస్థ జిల్లా అధ్యక్షు డు కృష్ణమూర్తి, ఉపసర్పంచ్ కేశవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## పీజీఆర్ఎస్ ఫిర్యాదులను తక్షణం పరిష్కరించండి


ఫిర్యాదులను పరిశీలిస్తున్న తహసీల్దార్ ధనంజయులు

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్‌లో రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదులను వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని తహసీల్దార్ ధనంజయులు సూచించారు. ఇటీవల మదనపల్లె తహసీల్దార్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చేకూరి ఆకస్మిక తనిఖీలో పీజీఆర్ఎస్ ఫిర్యాదులపై సమగ్ర నివేదిక ఇవ్వాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో తహసీల్దార్ సమీక్ష సమావేశం నిర్వహించి పీజీఆర్ఎస్‌లో రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదులను వెంటనే క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి తమకు నివేదిక ఇవ్వడంతోపాటు, వారికి న్యాయం చేయాలని ఆదేశించారు. ఫిర్యాదుల విషయంలో ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ శేషాద్రిరావు, సర్వేయర్ రెడ్డిశేఖర్, వీర్వోలు నారాయణ, శివశంకర్, మాధవ్‌రెడ్డి, మునుస్వామినాయక్, చంద్రయ్య, సుజాత, మస్తాన్, నాగేశ్వరి, సంధ్య, సౌజన్య, పాల్గొన్నారు.

## ఇసుక అక్రమ తవ్వకాలకు పాల్పడితే చర్యలు

- వాల్మీకిపురంలో ఆగని అక్రమ రవాణా


ఓబులంపల్లె వద్ద అక్రమంగా ఇసుక డంపింగ్ చేసిన దృశ్యం

వాల్మీకిపురం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమ తవ్వకాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని వాల్మీకిపురం తహసీల్దార్ పామిలేటి హెచ్చరించారు. మంగళవారం గ్రామ పంచాయతీ పరిధిలోని ఓబులంపల్లె సమీపాన వంక పోరంబోకు ప్రాంతంలో ఎక్స్‌కవేటర్‌తో ఇసుక అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్నట్లు గ్రామస్థులు ఫిర్యాదు చేయడంతో తహసీల్దార్ తక్షణం స్పందించారు. వంక ప్రాంతంలో ఇసుక తవ్వకాలు, డంపింగ్‌కు పాల్పడుతున్న యంత్రాన్ని అడ్డుకుని చర్యలు తీసుకున్నారు. అనుమతులు లేకుండా, ప్రభుత్వ స్థలాలలో ఇసుక అక్రమ తవ్వకాలకు పాల్పడితే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అయితే గ్రామ సమీపంలో శ్మశాన వాటిక ప్రాంతంలో ఇసుక అక్రమ తవ్వకాలకు నిత్యం పాల్పడుతూనే ఉన్నారని గ్రామస్థులు వాపోతున్నారు.

## బస్సుల కండీషన్‌పై డ్రైవర్లకు అవగాహన



మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి):ప్రజలకు, ప్రయాణికుల కండీషన్‌తో కూడిన బస్సులు అందించడంతో ప్రమాదాలు జరగకుండా డ్రైవర్లు తగిన జాగ్రత్తలు పాటించాలని మదనపల్లె వన్ డిపో మేనేజరు మూరే వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన డ్రైవర్లతో బస్సుల కండీషన్‌పై రోడ్డుపై పరిశీలించి వారికి అవగాహన కల్పించారు. మంగళవారం నుంచి ప్రతి రోజు షెడ్యూల్ 3-4 అయిన బస్సులను రోడ్డుపైకి తీసుకెళ్లి బ్రేక్ కండిషన్, స్టీరింగ్ కండీషన్, ఎలక్ట్రికల్ వైరింగ్, బ్యాటరీ కండీషన్. డ్రైవర్, ప్యాసింజర్ సీట్లు కండీషన్ పరిశీలించిన అనంతరం సర్వీసులు నడుపుతామని డీఎం పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఎం తోపాటు డ్రైవర్లు పాల్గొన్నారు.

## విజిలెన్స్ జిల్లా కమిటీ సభ్యుడిగా చంద్రశేఖర్



మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): విజిలెన్స్ మానిటరింగ్ జిల్లా కమిటీ సభ్యుడుగా మదనపల్లెకు చెందిన చంద్రశేఖర్ పసలను నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. రెండేళ్ల పాటు డీవీఎంసీ కమిటీ సభ్యుడుగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం అమలుకు, సమావేశాలు నిర్వహించడం, ప్రభుత్వ పథకాలను సమీక్షించే ఈ కమిటిలో చంద్రశేఖర్‌ను సభ్యుడిగా నియ మించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారుల సహకారం తో ఎస్సీ, ఎస్టీల సమస్యలను పరిష్కరించడానికి తన వంతు కృషి చేస్తాన న్నారు. పలువురు చంద్రశేఖర్‌ను అభినందించారు.

## తారురోడ్ల నిర్మాణం ఎప్పుడో..?


తారురోడ్డుకు నోచుకోని షేర్‌ఖాన్‌వడ్డిపల్లె

కలకడ, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి):మండలంలో పంచాయతీ రాజ్ పథకంలో ప్రారంభమైన పలు తారురోడ్ల నిర్మాణం ప్రశ్నార్థకంగా మారాయి. దశాబ్దం కిందట ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి హయాంలో వివిధ గ్రామాలకు తారురోడ్లు సౌకర్యం కల్పించాలని అప్పటిలో నిధుల మంజూరు చేసినట్లు తెలిసింది. ఇందులో చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారి నుంచి షేర్‌ఖాన్‌వడ్డిపల్లె వరకు 1.3 కిలోమీటర్‌లకు రూ.48 లక్షలు, అలాగే పోతువారిపల్లెకు 1.2కిలోమీటర్ల దూరానికి రూ.40 లక్షలు నిధులు మంజూరైన వాటిలో ఉన్నాయి. రాష్ట్ర విభజన జరగడంతో నిధుల విడుదలకు బ్రేక్‌పడి అర్థాంతరంగా నిలిచిపోయాయి. అధికారంలో ఉన్న ప్రభుత్వాలు పనుల ఊసెత్తకపోవడతో ఆయా గ్రామాలు తారు రోడ్లకు నోచుకోకపోవడంతో ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దెబ్బతిన మట్టి రోడ్ల గుండా ప్రయాణం రాకపోకలకు కష్టమవుతోందని గ్రామస్థులు వాపోతున్నారు. ఇకనైన ప్రభుత్వం స్పందించి త్వరితి గతిన పనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి


సబ్‌కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆశావర్కర్లు, సీఐటీయూ నాయకులు

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పి.శ్రీనివాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ మేరకు మంగళవారం స్థానిక సబ్‌కలెక్టరేట్ ఎదుట ఆశా వర్కర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ ఆశావర్కర్లకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ రూ.5లక్షలు, పెన్షన్‌ను నెలకు రూ.10వేలు చెల్లించాలన్నారు. 20ఏళ్లుగా పనిచేస్తున్న ఆశా వర్కర్ల వేతనాలను నిత్యావసర ధరలకు అనుగుణంగా పెంచాలన్నారు. ఏఎన్ఎం, ఎంఎల్ హెచ్‌పీలు చేసే పనులను ఆశా వర్కర్ల చేత చేయిస్తున్నారని, వారిపై పనిభారం తగ్గించాలన్నారు. ఆశావర్కర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు జయమ్మ మాట్లాడుతూ ఆశా వర్కర్ల వేతనాలను రూ.20వేలకు పెంచాలని, ఆశాలకు గ్రూప్ ఇన్సూరెన్స్ రూ.10 లక్షలు చేయాలని ప్రభుత్వ సెలవులతో పాటు, మెడికల్ లీవులు మంజూరు చేయాలన్నారు. ఆశాలు మరణిస్తే వారి కుటుంబీకులకు ఆశా వర్కర్ పోస్టు మంజూరు చేయాలన్నారు. అనంతరం డీఏవో రాఘవేంద్రకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్ అసోసియేషన్ నాయకురాళ్లు రమామణి, హారిక, గాయత్రి, మంజుల, మల్లేశ్వరి, పుణ్యవతి, సుజాత, పార్వతి, కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

## డ్వాక్రా రుణాలను సద్వినియోగం చేసుకోవాలి


సభ్యులకు సూచనలిస్తున్న యూనియన్‌బ్యాంకు ఏజీఎం రాంప్రసాద్

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాలకు బ్యాంకు మంజూరు చేసే రుణాలను సద్వినియోగం చేసుకోవాలని యూనియన్‌బ్యాంకు ఏజీఎం రాంప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మహిళా సమాఖ్య కార్యాలయంలో మహిళా గ్రూపు సభ్యులకు రూ.4కోట్ల రుణాల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు ఇచ్చే రుణాలను మంచి వ్యాపారాలకు, కార్యక్రమాలకు వినియోగించాలని, దుర్వినియోగం చేస్తే తిరిగి రుణాలు చెల్లించడం కష్టమవుతుందన్నారు. ప్రస్తుతం ఇచ్చే రుణాలకు సకాలంలో చెల్లిస్తే భవిష్యత్‌లో ఇంకా పెద్దమొత్తంలో రుణాలు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో మేనేజర్లు గోవర్ధన్, పవన్, ఏపీఎం సుబ్రమణ్యం, మహిళా గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.

## ప్రజ్ఞా వికాస పరీక్షలు ఎంతో ఉపయోగం

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించనున్న ప్రజ్ఞా వికాస పరీక్షలు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటాయని యూటీఎఫ్ జిల్లా నాయకులు సుధాకర్‌నాయుడు, గాలి రవీంద్ర పేర్కొన్నారు. మంగళవారం స్థానిక జడ్పీహైస్కూల్లో ప్రజ్ఞావికాస పరీక్షల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విద్యార్థుల్లో పరీక్షలంటే భయాన్ని పోగొట్టడానికి ప్రజ్ఞావికాస పరీక్షలు ఉపయోగపడతాయన్నారు. టెన్త్ విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలకుఈ పరీక్షలు సిద్ధం చేస్తాయన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సర్వేపల్లె నరసింహ మాట్లాడుతూ ఫిబ్రవరి 22వ తేదీ నిర్వహించే ప్రజ్ఞావికాస పరీక్షలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ పరీక్షలు రాయగోరే విద్యార్థులు పూర్తి సమాచారం కోసం 9010627332 నెంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు జయబాబు, యూటీఎఫ్ నాయకులు బాబ్‌జాన్, రెడ్డిప్రసాద్, భారతి, సరళాదేవి, విజయ, రెడ్డెమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఎర్రసానిపల్లెలో తాగునీటి సమస్య తీర్చండి


నీటి సమస్య తీర్చాలని కోరుతున్న గ్రామస్థులు

తంబళ్లపల్లె, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రసానిపల్లె గ్రామంలో దెబ్బతిన్న పైపులైన్ స్థానంలో నూతన పైపులు వేసి తాగునీటి సమస్య తీర్చాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎర్రసానిపల్లెలో సుమారు 42 కుటుంబాల వరకు జీవనం సాగిస్తున్నారన్నారు. కొన్నేళ్ల క్రితం గ్రామంలో సిమెంటు రోడ్ల నిర్మాణాలు చేపట్టగా, తాగునీటి బోరు నుంచి వచ్చే పైపు లైను రోడ్డు కింద ఉండిపోయి దెబ్బతినిందన్నారు. దీంతో బోరు నుంచి పైపు లైన్ ద్వారా వచ్చే నీరు మొదట్లో ఉన్న నాలుగైదు కుటుంబాలకు మాత్రమే వస్తున్నాయని, మిగిలిన వారు అక్కడికే వెళ్లి తెచ్చుకోవాల్సి వస్తోందన్నారు. వృద్ధులు, మహిళలు చాలా దూరం నుంచి నీటిని తెచ్చుకోవాలంటే ఇబ్బందులు పడాల్సి వస్తోందని వాపోతున్నారు. పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు తెలిపినా పట్టించుకోవడంలేదని వాపోయారు. ఉన్నతాధికారులు స్పందించి నూతన పైపులైన్ వేసి తాగునీటి సమస్య తీర్చాలని గ్రామస్థులు కోరుతున్నారు.


## అంగన్‌వాడీలకు జ్ఞానజ్యోతి శిక్షణ


అంగన్‌వాడీలకు శిక్షణ ఇస్తున్న అధికారులు

తంబళ్లపల్లె, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీలకు మంగళవారం ఎంఈవో త్యాగరాజు, సీడీపీవో నాగవేణి ఆధ్వర్యంలో జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఫ్ఎల్ఎన్ జ్ఞానజ్యోతి 120 రోజుల కోర్సులో భాగంగా మొదటి విడతలో 51 మంది అంగన్‌వాడీలకు చిన్నారుల్లో విద్యను పెంపొందించే అంశాలు, నిపున్ భారత్, ఎఫ్ఎల్ఎన్ లక్ష్యాలు, వాటి సాధనపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ...జ్ఞానజ్యోతి శిక్షణ అంగన్‌వాడీలకు రెండు విడతలుగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అభ్యసనను బలోపేతం చేయడం, పిల్లలకు ఆటలు, పాటల ద్వారా అభ్యసన చేయడం, చిన్నారుల్లో విద్యను పెంపొందించడంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాసులు, డీఆర్పీలు ఆనంద్, యశానుల్లా, ఈశ్వర్‌రెడ్డి సూపర్‌వైజర్లు రాధమ్మ, కుసుమకుమారి, ధనలక్ష్మీ, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

**పెద్దతిప్పసముద్రంలో :** స్థానిక ఆదర్శ పాఠశాలలో మంగళవారం అంగన్‌వాడీ లలో పని చేసే 51 మంది అంగన్‌వాడీ కార్యకర్తలకు ఎఫ్ఎల్ఎన్ జ్ఞానజ్యోతి 120 దినాల శిక్షణా కార్యక్రమంలో భాగంగా మొదటి విడత శిక్షణ ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంఈవో నారాయణ, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ శివకుమారిలు మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలకు "ఈసీ. సీఈ నందు నైపుణ్యతను పెంపొందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగరత్నమ్మ, జయరాణి, భవాని, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## పక్కాగృహాల నిర్మాణాలు పరిశీలన


పక్కాగృహాల నిర్మాణాలు పరిశీలిస్తున్న తహసీల్దార్

పెద్దమండ్యం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి) పెద్దమండ్యం సమీపంలోని లేఅవుట్ లో జరుగుతున్న పక్కాగృహాల నిర్మాణాలను పెద్దమండ్యం తహసీల్దార్ సయ్యద్ ఆహ్మద్ మంగళవారం పరిశీలించారు. జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదేశాల మేరకు మండలంలోని లేఆవుట్ లోని పక్కాగృహాల నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలోని అన్ని లేఆవుట్‌లో పక్కాగృహాల స్థితిగతులను పరిశీలిస్తామన్నారు. ఇంటి పట్టాలు మంజూరు, లబ్ధిదారుల వివరాలు, పక్కాగృహాల వివిద దశల్లో నిర్మాణాలు గురించి హౌసింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. పక్కాగృహాల నిర్మాణాల నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేస్తామని తహసీల్దార్ పేర్కొన్నారు. హౌసింగ్ ఏఈ అక్రమ్, వీఆర్‌వోలు విశ్వంభరనాయుడు, నవాజ్, ఇంజనీరు అసిస్టెంట్‌లు కూటమి నేతలు నారా గంగాధర, మహేశ్వర, కాలేషా, సుబ్బరామిరెడ్డి, వెంకరమణ పాల్గొన్నారు.

## ఇంజనీరింగ్ అసిస్టెంట్లపై ఎంపీడీవో ఆగ్రహం

పెద్దమండ్యం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి) మండలంలోని ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లపై ఎంపీడీవో శ్రీధర్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం పక్కాగృహాల నిర్మాణాలపై సమీక్ష సమావేశంలో మండలంలోని పక్కాగృహా నిర్మాణాలపై కొందరు ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఎంపీడీవో దృష్టికి వెళ్లింది. ప్రభుత్వ నింబంధనల ప్రకారం పని చేయని వారికి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి, శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. పక్కాగృహాలు నిర్మాణాల వేగవంతం చేయడానికి ప్రతి రోజు లబ్ధిదారులతో సమావేశం నిర్వహించాలన్నారు. అందరూ బాధ్యతగా పని చేసి పేదల ఇళ్ల పూర్తికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. హౌసింగ్ ఏఈ అక్రమ్, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.